


By Courtesy—" The Hin

పిల్లల బొమ్మల పత్రిక

Vol. 3
No. 7

# BALA

FEBRUARY, 1948

6
ANN



చి॥ విట్టా అన్నపూర్ణ (మదరాసు)

(అడయారు "కళాక్షేత్ర"లో నృత్యము నేర్చుకొని పేరుపొందిన ఆంధ్రబాలిక)



చి॥ వెల్దుర్తి గుండేరావు

చెల్లెలితో (హైదరాబాదు)







ఎందుకు అంత ఉత్సాహము? ఆనవ్వు ఆమె యొక్క మనోల్లాసమును తెలియజేయుచున్నది. జేమ్సు ఆమ్లా తలనూనెను వాడితే చక్కని కురులు, మెదడుకు చల్లదనం మనోల్లాసం కలుగును.

James
PERFUMERY COMPANY
MADRAS
CALCUTTA

జేమ్సు పెర్ఫ్యూమరీ కంపెనీ

మదరాసు — కలకత్తా.


Start the day Smoothly -
25 ఏండ్ల క్రిందట భారతాకాశం మీద పారిశ్రామిక తార ప్రకాసించింది. ఉత్సాహము, సాహసము వీటి ఫలితమే
"స్టార్ ఆఫ్ ఇండియా"
పెనసళ్లు. సరసమైన వెలకు, దీర్ఘ కాలపు మన్నగడకు యీ పెనసళ్లు ఎల్లడల, సార్వజనీనమైన ఆమోదాన్ని పొందినవి.
Star of India
వివరములకు వ్రాయుడు:
మదరాసు పెన్సిల్ ఫ్యాక్టరీ, మదరాసు.
ప్రొప్రయిటర్సు:
వి. పెరుమాల్ చెట్టి అండ్ సన్సు

# భారతదేశమందలి పూలచెట్లు

## భారతీయ పగడపుచెట్టు



భారతదేశపు పడమటితీరమందన్నిచోట్ల ఈ చెట్టు పూత పూయుచు ఫిబ్రవరి మొదలు మేనెల వరకు గల కాలములో అత్యంత శోభతో నుండును. దాని ఎఱ్ఱని పుష్పసముదాయము కన్నులపండువుగా నుండును. రోజంతయు వీటిచుట్టును మూగు వివిధరకముల విహంగముల కిలకిల రవములచే ఆ దృశ్యము ద్విగుణీకృత మనోహరముగా నుండును.

ఎండాకాలమున విశేషముగు నీడనిచ్చుటయేగాక భూమికికూడ మంచిదగుటచే, పురాతనకాలము నుండియు భారతదేశమంతటను ఈచెట్టు పెంచబడుచున్నది. ఈ పగడపు చెట్టును గురించి ఒక కథగలదు. దీనిని మీరు పురాణములలో చదువగలరు.

ఈ చెట్టుకొరకు మీ చుట్టుపట్ల చూడండి. అసాధారణమగు దాని పూలను, రంగులను బాగుగా గమనించండి.

తరువాత ప్రకటనలో మరియొక రకముకొరకు వేచియుండండి.

హమాం & 501 సబ్బులను తయారుచేయు
**టాటా ఆయిల్ మిల్సు కం|| లి||** వారిచే
ప్రకటించబడినది.




TI 1149

# అశోకా ఆమ్లా

## హేర్ ఆయిల్

సుప్రశిద్ధమైనది



# ASOKA
## AMLA HAIR OIL




బాలా !

అశోకా ఆమ్లా తలనూనెను ఒకసారి వాడిచూడు. దాని చల్లదనము, సువాసన, కురులు, నిగనిగలాడుతూ, నల్లగాను, పొడవుగాను చేయుగుణము నీకే తెలియును. గుణమందేగాక యిది యింపైన పరిమళభరితమైనది.

తయారుచేయువారు :

## విజయా కెమికల్ అండ్ టాయిలెట్ వర్క్సు

21, 22, సూర్యనారాయణ చెట్టి వీధి,

★






లివర్ & స్ప్లీన్ వ్యాధులచే బాధ పడుచు, యితర ఔషధములచే నివారింపబడజాలని శిశువులు వేలకొలది, యీ అద్భుతఔషధరాజముచే రక్షింపబడిరి.

జమ్మి వెంకటరమణయ్యగారి

# లివర్ క్యూర్

జమ్మి వెంకటరమణయ్య గారి 'లివర్ క్యూర్' ప్రఖ్యాతిగాంచిన వైద్యులు దీనిని వైద్య శాస్త్రములో [illegible] శ్లాఘించుచున్నారు.

[illegible]

జమ్మి వెంకటరమణయ్య & సన్సు

1/1, [illegible] రోడ్డు, [illegible], [illegible].

బ్రాంచిలు : బొంబాయి, కలకత్తా, లక్నో, బెంగళూరు, [illegible] మొదలగు పట్టణములందు కూడ ఆఫీసులు గలవు.

★




**'BALA'** CHILDREN'S ILLUSTRATED MONTHLY

సంపాదకుడు: న్యాయపతి రాఘవరావు బి.ఎ.

సహాయ సంపాదకురాలు: న్యాయపతి కామేశ్వరి బి. ఎ., ఎల్.టి.

సంపుటి 3] ఫిబ్రవరి **1948** [సంచిక 7

---

# మన గాంధీతాత ఏడీ?

లేదు .... ఇక లేదు

మనల్ని విడచి పోయాడు. చుక్కల్లో కలిసి పోయాడు.

జేజదగ్గరికి వెళ్లిపోయాడు!

★

తాతా! గాంధీతాతా!
విడిచిపోయినావా-మము
విడిచిపోయినావా ॥తాతా॥

పాపలచూచీ-పకపక నవ్వే
బోసినోరు ఇక లేదా? .....

సత్యం శాంతం నిత్యం చెప్పే
సత్యరూపు డిక లేడా!
లేడా! లేడా! — ॥తాతా॥

---

గాంధీ తాత ఆత్మకు శాంతి కలుగుగాక!

# గాంధీ తాత ఎలాగ చనిపోయాడు?

అది జనవరి 30 వ తేది
శుక్రవారం.
సాయంత్రం 5 గం॥ లకు
ఢిల్లీలో
బిర్లా భవనంలో
గాంధీ తాత
మామూలుగా
ప్రార్థన చేయడానికి
వస్తూవుండగా—
ఒక హిందువుడు
గాంధీ తాత
కడుపులోనూ
గుండెలమీదా
తుపాకిగుండ్లు
కాల్చి చంపాడు!
పాపం!
వెంటనే
గాంధీ తాత
"హరే రాం! హరే రాం!"
అంటూ పడిపోయాడు.
కొంతసేపటికి
ప్రాణాలు పోయాయి.
గాంధీతాత చనిపోయాడు.
పాపల గాంధీ
పిల్లల గాంధీ
నవ్వుల గాంధీ
మహాత్మ గాంధీ
అవతారం చాలించాడు.
అమర లోకానికి
అంటే
స్వర్గలోకానికి వెళ్లాడు.
మన దేశంలో
ఈ దుఃఖవార్త విని
కన్నీరు కార్చనివారు
లేరు.
ఎందుచేత?
గాంధీ జీ
అందర్నీ
ప్రేమతో చూచేవాడు,
అందరూ
గాంధీజీని ప్రేమించేవారు.
ప్రపంచం అంతటా
గాంధీ జీ
మహాత్ముడని,
దేముడని, అవతారం అని
పేరు పొందాడు.
అట్టి గాంధీతాత
ఇక లేదు.
జనవరి 30 తేదీని
చనిపోయాడు.
ఇక మిగిలిన దేమిటి?
గాంధీ తాత
మనకు చెప్పిన నీతివాక్యాలే!

# గాంధీతాత చిన్ననాటిచరిత్ర

- గాంధీతాత 1869 సం॥ అక్టోబరు 2వ తేదీని పుట్టేడు.
- అంటే గాంధీతాతకి ఇప్పుడు 79 ఏళ్లన్నమాట.
  గాంధీతాత పుట్టిన ఊరిపేరు పోర్బంధర్.
- పోర్బంధర్‌లోనే మొదట తనచదువు మొదలెట్టాడు.
- "ఎక్కాలు ఎంతో కష్టపడి చదివే వాడిని" అని గాంధీజీ తన ఆత్మకథలో రాశాడు.
- తరువాత రాజకోటలో ఒకప్రైమరీ బడిలో చదివాడు. బడిలో ఎవ్వరితోనూ మాట్లాడేవాడుకాదు. చాలాసిగ్గు, భయంతో వుండేవాడు. గంటకొట్టగానే బడికి రావడం సాయంత్రం బడిమూయగానే పరుగెత్తుకొని తిన్నగా ఇంటికివెళ్లిపోవడం ఇది జరిగేది. ఏరోజుపాఠాలు ఆరోజే చదివేసుకొనేనాడు.
- గాంధీతాత చిన్నప్పటినుండి అబద్ధం ఆడేవాడుకాదు.


1883 ప్రాథమిక పాటశాలలో


1883 రాజకోట హైస్కూలులో




1890 లండన్‌లో బారిష్టరు చదువుతున్నపుడు.

○ బడిలో లెక్కలుగాని, స్పెల్లింగుగాని రాకపోతే పక్కవాళ్ల పలక చూచి కాపీకొట్టడం ఎన్నడూ చేసేవాడు కాడు.


○ ఒకసారి బడికి ఇనస్పెక్టరు వచ్చాడు. ఇంగ్లీషులో స్పెల్లింగ్ పరీక్ష చేశాడు. 'KETTLE' అనుమాటకి స్పెల్లింగ్ గాంధీజీ తప్పు రాశాడు. కాని, వాళ్ల మాస్టారు, గాంధీజీకి సైగచేశాడు. ఏమని? పక్కవాడి పలక చూసి రైటుగా రాసీమని. గురువుగారే ఇంలాంటి పనులు చెప్పినా, గాంధీజీ అటువంటి దొంగ పని ఎప్పుడూ చేయలేదు.

○ ఈసంగతి గాంధీజీ తనఆత్మకథలోరాస్తూ ఏమన్నాడో తెలుసా? గురువుగారిలో ఎన్ని లోపాలున్నా, వారు గురువుగారు గనుక వారియడల భక్తి, గౌరవం వుండాలి.

○ గాంధీతాతకి, చిన్నప్పుడు హరిశ్చంద్ర నాటకం చూడడం అంటే చాలాసరదా. హరిశ్చంద్రుడులాగ అందరూ నిజంపలుకుతే బాగుండును అనుకొనేవాడు.

○ బడిలో గాంధీతాత చాలాబుద్ధిమంతుడని పేరు పొందేడు. Progress రిపోర్టులో గాంధీజీ నడవడిక ఎప్పుడు మంచివాడుగానే రాసివుండేది.

○ గాంధీజీకి చిన్నతరగతులలో కొన్ని బహుమానాలు, స్కాలర్‌షిప్పులూ వచ్చాయి.



1912 దక్షిణాఫ్రికా సత్యాగ్రహములో.

○ ఎప్పుడేనా గాంధీజీ పొరపాటుచ్తేసే చాలా విచారించేవాడు. కళ్ల వెంబడి నీళ్లుకూడా వచ్చేవి.



1906 ఆఫ్రికాలో వాలంటీరుగా.

○ మేష్టారు ఎప్పుడో ఒక బెత్తంతో కొట్టేరు. అప్పుడు గాంధీజీ ఇలా అనుకున్నాడు. "అవును. నేనేదో తప్పుచేసి వుంటాను. లేకపోతే మేష్టారు ఎందుకు కొడతారు? నాతప్పుకి ఈ శిక్ష అనుభవించవలసిందే" అని మనసులో అనుకొనేవాడు.

○ గాంధీజీ, తన దస్తూరీ కుదురుగా రాయడానికి కాపీలు సరిగా రాసేవాడుకాదు. తాను పెద్దయిం తరువాత దానిని గురించి చాలా విచారించాడు.

○ అలాగే చిన్నప్పుడు గాంధీజీకి ఆటలంటే అంత సరదా లేదట.

○ బడిలో Football, Cricket ఆటలు అందరూ ఆడేవారు. గాంధీజీకి ఆ ఆటలు అప్పుడు ఇష్టంలేదట. పెద్దయిన తరువాత గాంధీజీ అయ్యో! ఆ ఆటలు ఆడివుంటే బాగుండునే అనిపించిందట.

○ చిన్నప్పుడు గాంధీజీ కాలినడకని షికారు వెళ్తూవుండేవాడట. అతనికి అదే సరదా. గాంధీతాతకి ఆ అలవాటు ఇప్పటివరకూ వుంది.

○ గాంధీజీ తన నాల్గవ తరగతినుండి సంస్కృతం నేర్చుకున్నాడు. అలాసంస్కృతం నేర్చుకున్న మూలాన్నే భగవద్గీత, ఇంకా ఇతర గ్రంథాలూ చదివి అర్థంచేసుకున్నాడు.



గాంధీటోపీ—జుబ్బాతో

○ ప్రతిబాలుడూ ప్రతిబాలికా సంస్కృతం నేర్చుకోవాలని గాంధీతాత తన పుస్తకంలో రాశాడు.

○ గాంధీజీకి 13 వ ఏటే పెళ్లయిందట ! అంత చిన్నవయసులో పెళ్లికావడం తనకి ఎంతో సిగ్గుగావుందనీ రాశాడు.

○ చిన్నప్పుడు గాంధీజీకి కొందరు చెడ్డస్నేహితులు వుండేవారుగాని గాంధీజీ వాళ్ల స్నేహం నెమ్మదిగా వదిలేశాడు.

○ ఒకనాడు గాంధీజీ ఒకపెద్దతప్పు చేశాడు. కాని తనమనస్సు చాలా బాధ పడింది. తన తండ్రితో తాను ఆతప్పు చేశానని ఒప్పుకున్నాడు. గాంధీజీ, అలా తాను చేసిన తప్పు ఒప్పుకున్నందుకు తనకు ఒకపెద్దబరువు తగ్గినట్లు వుందట.

○ గాంధీజీ చిన్నప్పుడే "అపకారికి ఉపకారము చేయాలి" అన్న గొప్పనీతిని గుజరాతీ గీతికలో చదివాడు.

○ గాంధీజీ మెట్రిక్యులేషన్ పాసయాక, బారిష్టరు చదవడానికి లండను వెళ్లాడు.

○ లండను వెళ్లేముందు గాంధీజీ యీమూడు ప్రమాణాలూ చేశాడు

1 అబద్ధమాడను.

2 మాంసంతినను; కల్లుతాగను.

3 దొరసానులతో నేస్తం కట్టను.

ఈమూడు ప్రమాణాలు గాంధీజీ తన తల్లిదగ్గర చేశాడు.

○ తరువాత ఇంగ్లాండు వెళ్లి బారిష్టరు చదివి మనదేశం తిరిగివచ్చాడు.

○ గాంధీతాత ప్లీడరు చదివినా, మొదటినుంచీ ఆవృత్తిలో అంతగా శ్రద్ధలేదు. ఆయనకి దేశసేవ చేయడం అంటే ఇష్టం.

○ గాంధీతాత ఆఫ్రికాలోను, మనదేశంలోనూ ప్రజలకు ఎంతో సేవ చేశాడు.

○ అక్కడే మొట్టమొదట "సత్యాగ్రహం" ఆరంభించాడు.

○ ఆఫ్రికాలో వాలంటేరుగా పనిచేసి, ఎందరో దెబ్బలుతగిలిన జులూ జాతివారికి సహాయంచేశాడు.

○ మన దేశం స్వరాజ్యం కోసం ఎన్నో సార్లు జైలుకెళ్లాడు.

○ హరిజనులుపాపం, ఎంతో వెనకబడి వున్నారు. వాళ్లని మనతో సరిసమానంగా చూడాలని గాంధీజీ బోధించాడు.

○ ముఖ్యంగా హిందువులు, ముస్లింలూ కలిసి, ఐకమత్యంగా వుండాలని బోధించాడు.

○ గాంధీతాత ఇంత గొప్పవాడు గనుకనే, ప్రపంచం అంతా అతనిని మహాత్ముడన్నారు. అప్పటినుంచీ అందరూ "మహాత్మాగాంధి" అని పిలుస్తున్నారు.

○ మనకి మొన్న ఆగస్టు 15 తేదీని స్వరాజ్యం వచ్చింది.

○ కాని హిందువులు, ముస్లింలు ఇంకా ఐక్యంకాలేదు. అందుకోసం గాంధీజీ మొన్న మొన్ననే ఉపవాసం కూడా చేశాడు.

○ అందరూ ఐక్యంగా వుంటాం అని హిందువులు, మహమ్మదీయులు ప్రమాణం చేశారుకూడాను.

కాని— కాని—ఇంతలో ఈఘోరం జరిగింది—

---

ఈ 'బాల' లో వేసిన గాంధీజీ చిన్ననాటి బొమ్మలు శ్రీకల్చరల్ బుక్సు లిమిటెడ్, పెరంబూరు, మదరాసు. వారు దయతో ఇచ్చారు. ఈబొమ్మలు వారు ప్రచురించిన "నాజీవితము" అను గాంధీజీ ఆత్మకథలో ఉన్నాయి.

---

**తెలుసా**

గాంధీ తాత చనిపోయాడు అనే కబురు వినగానే, కొందరు హటాత్తుగా చనిపోయారట!

# బుడుగో! బుడుగో!

పాలిచ్చి
మా అమ్మ
నన్ను పెంచింది
బుడుగో! బుడుగో!

ముద్దెట్టి
మా మామ
ఎత్తుకుందోయి
బుడుగో! బుడుగో!

చదివించి
మా గురువు
బుద్ధి గరిపాడు
బుడుగో! బుడుగో!

కష్టించి
మా నాన్న
పెద్ద చేసాడు
బుడుగో! బుడుగో!

రచన : ఊండ్రురాజ్యం

# కృష్ణవేణి సిరాలు




## వాడితే మీ దస్తూరీ ఎంతో బాగుంటుంది.

దస్తూరీ బాగుంటేనే మనం రాసింది అందరూ సులువుగా చదువుతారు.

## కృష్ణవేణి సిరాలు

అన్నిరంగులలోను, స్టేషనరివర్తకులందరివద్దను దొరుకును.

సోల్ డిస్ట్రిబ్యూటర్లు:

ది నేషనల్ ప్రొడక్ట్సు సిండికేట్,

యింటు మాన్షన్,

141, గోవిందప్పనాయక వీధి, మద్రాసు 1.

**Phone No. 3189**

**Grams: Permanancy, Madras.**



# మంచి కర్పూరం

# అందరికీ కావాలి

## కాని, అది ఏదో చాలామందికి తెలియదు

మంచి కర్పూరం కావాలంటే,

"గడియారం" మార్కు కర్పూరం కొనండి.

అది అన్నిషాపులలోనూ దొరకుతుంది. లేదా, యీక్రింది అడ్రసుకు వ్రాయండి.

## గోపాల్‌జీ చాంప్షీ అండ్ కో.,


30, గోవిందప్పనాయక్ వీధి, G. T. మద్రాసు.

# చిన్నిరాము - చిన్నిసోము

రాము తమ్ముడు చిన్నరాము; సోము తమ్ముడు చిన్నసోము. రాము గుణాలు చిన్నరామునికి కూడా వచ్చాయి. సోముగుణాలు చిన్నసోముకి వచ్చాయి. ఈదిగువ బొమ్మలో గీరల చొక్కా అబ్బాయే చిన్నరాము. తెల్లచొక్కా వేసుకొన్న అబ్బాయి చిన్నసోము.




చిన్న రాము, వాళ్ళ అమ్మ చెప్పినట్టు విని, గోళ్లు కత్తిరించుకుంటాడు. ఆటల్లో స్నేహితులతో సరదాగా చేతులు కలిపి ఆడుకుంటాడు.




చిన్నసోము అమ్మమాట వినడు. గోళ్లుకత్తిరించుకోక, పెద్దపులి గోళ్ల లాగ పెంచుతాడు. స్నేహితులు, ఆ గోళ్లకు జడిసి వాడితో ఆడుకోరు!

# మంచి మార్కులు!!!

తండ్రి : ఏమండీ మేష్టారుగారూ! మా అబ్బాయి రోజూ ఎంతో శ్రద్ధగా పాఠాలు చదువుతాడు. పరీక్షలో అన్ని ప్రశ్నలూ బాగారాశాడట. కాని ఇదేమిటీ ఇంత తక్కువ మార్కులు ఇచ్చారు?

మేష్టారు : నేనేంచేసేదండీ? అది మీ అబ్బాయి రాత!

తండ్రి : అదేమిటండీ! మా అబ్బాయి బాగానే రాస్తాడే?

మేష్టారు : ఇదుగో చూడండి మీ అబ్బాయి ఆన్సరు కాగితాలు, చేవ్రాత ఎలాగుందో!

తండ్రి : అవునండీ - సిరా ముద్దలు ముద్దలుగాను అక్షరాలు కోడిబరికినట్లుగాను అసహ్యంగా వున్నాయి.

మేష్టారు : చవకరకం సిరాలు వాడితే అక్షరాలు ఇలాగే ఏడుస్తాయండీ!




తండ్రి : అయితే మంచి సిరా ఏది?

మేష్టారు : జాబ్ కో ఫౌంట్ ఇంక్ తో రాస్తే ముత్యాల్లాంటి అక్షరాలు వస్తాయి. అది వాడిచూడండి.

తండ్రి : చిత్తం.

## జయభారతం కంపెనీ

మదరాసు — బెంగళూరు — ఎర్నాకుళం

# లటుకు - చిటుకు.



లటుకు: ఒరేయ్! నేను గుళ్లో లింగాన్ని మింగేస్తానురా!

చిటుకు: ఓస్! అది ఒకగొప్పా? నేను గుడినే మింగేస్తాను!

[సామెత: గుడిలో లింగాన్ని మింగే వాడొకడైతే గుడిని మింగేవాడు మరొకడు]

♦ ♦ ♦

లటుకు: నేను ఎంతఎత్తయిన తాటిచెట్టునైనా ఎక్కేయగలను.

చిటుకు: ఓస్! నీవు తాటిచెట్టు ఎక్కివుండగా నీతలమీద తంతాను తెలుసా?

[సామెత: తాడెక్కువానిని తలదన్నువాడుండును.]

♦ ♦ ♦

లటుకు: మానాన్న రాసినరాత ఎవ్వరూ చదవలేరు.

చిటుకు: ఏడిశావులే! అదీ ఒకగొప్పకింద చెప్తావు. మా నాన్నరాసినరాత మా నాన్నే చదవలేడు!

[సామెత: తనురాసినరాత తనవారు గనలేరు తనురాసినరాత తానె గనలేదు]

రచన: నాళ్లచెర్వుల బదరీనారాయణరావు
(రాజమహేంద్రవరం)

# చమురు దీపం—కొవ్వొత్తి దీపం


అనగా అనగా ఒకవూళ్లో ఒక చమురుదీపం, ఒక కొవ్వొత్తి వున్నాయి.

చమురుదీపం చక్కగా గోడమీద వుండేది.

కొవ్వొత్తి, ఒకగూట్లో విరిగిపోయిన తాళంచెవులూ, మేకులూ అవీ వుంటాయి, పాతడొక్కు—ఆడొక్కులో పడివుండేది.

చమురుదీపం, రోజూ చక్కగా నిగ నిగలాడుతూ, తళ తళ లాడుతూ, వెలుగుతూ గర్వంగా వుండేది.

కొవ్వొత్తి అలామూలబడి వుండేది.




ఇంతట్లోకీ—యుద్ధంవచ్చింది. యుద్ధంలో కిరసనాయిలు కరువు వచ్చింది.

చమురుదీపం మూలబడింది. గర్వభంగం అయింది. అప్పుడు కొవ్వొత్తి బైటికివచ్చింది.

"బాలా! నన్ను వెలిగించు. నేను బతికివున్నంత సేపూ నీకు దీపంఇస్తాను. నేను పూర్తిగా కాలిపోయేవరకూ నీకు సేవచేస్తాను" అంది. చూశారా! మూలబడియున్న చిన్నకొవ్వొత్తి ఎంత ఉపయోగమో! మీరు ఎప్పుడూ ఒక కొవ్వొత్తిని ఇంట్లో దాచి వుంచండి. సమయానికి పనికివస్తుంది.

# బలేమంచిచోటు

[బలే మంచిచోటు అందరికీ ఇష్టమే! ఈ కథలో గోపు బలేమంచిచోటు ఎక్కడుందో తెలుసుకున్నాడు. చదవండి మీకుకూడా తెలుస్తుంది - సం||]

గోపు అందమైన చిన్నపిల్లవాడు. గోపుని చూస్తే, వాళ్లమ్మకీ, నాన్నకీ ఎంతో ముద్దు. గోపువుండే ఇల్లు ఒకపెద్దమేడ. పెద పెద్ద గదులూ, అద్దాల కిటికీలు, వీధికి పెద్దగేటు, కాంపౌండు, రకరకాల పూల మొక్కలు, అన్నిటితోటి ఆయిల్లు కలకలలాడుతూ ఎంతో బాగుంటుంది.

కాని గోపుకి మాత్రం ఆయిల్లంటే ఇష్టంలేదు. ఆయింటిని చూస్తే, గోపుకి కోపంవచ్చింది. అన్నంతినడం మానేశాడు. బొమ్మలతో ఆడుకోడం మానేసాడు. "ఛీ! ఈ యిల్లేమీ బాగులేదు. ఎప్పుడు చూసినా ఈ పాతఇల్లే- ఈ పాతబొమ్మలే- ఈ పాత అమ్మే-విసుగొస్తోంది. ఈ యిల్లు వదలి, నేనెక్కడికేనా వెళ్లిపోతాను. అన్నిటికంటే బలే మంచిచోటు ఎక్కడవుంటే, అక్కడ హాయిగా వుండిపోతాను" అనుకున్నాడు.

అనుకొని, ఆమర్నాడు పొద్దున్నే, ఎవ్వరికీ చెప్పకుండా, జేబులో అయిదణాలు మాత్రం వేసుకొని, ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఎక్కడికి?............ ఎక్కడ బలే మంచిచోటువుంటే అక్కడికి-అని బయలుదేరాడు.

అలా వెళ్లగా వెళ్లగా ఒక



చోట పెద్ద ఉత్సవం జరుగుతోంది. ఆ వుత్సవంలో ఎక్కడచూసినా అందరు ఎంతో సంతోషంగా వున్నారు. అక్కడ ఒక చోట రంగులరాట్నంకూడా వుంది. ఆరంగులరాట్నం గిర్ర్ర్ర్ మని తిరుగుతూ వుంటే, దాని గుర్రాలు కిందకీ మీదకీ వూగుతూ ఎంతో తమాషాగా వున్నాయి. బలే! ఆయ్ హాయ్! ఈ రంగుల రాట్నం ఎంత బాగుందో! నేను ఈ రంగులరాట్నం ఎక్కి, గిర్ర్ర్ మని తిరుగుతూ, ఇక్కడే హాయిగా వుండిపోతాను. ఇదే బలే మంచి చోటు" అనుకున్నాడు గోపు.


వెంటనే గోపు రెండణాలకి ఒక టిక్కెట్టు కొనుక్కొని, రంగులరాట్నం గుర్రం ఎక్కేడు. చుట్టూ గిర్ర్ర్ మని తిరుగుతూవుంటే, గోపు ఆనందం ఏమని చెప్పను! 5 చుట్లు తిరిగి, రంగులరాట్నం ఆగిపోయింది. గోపుకి ఇంకా ఎక్కాలని వుంది. ఒకటే సరదా. కాని ఎలాగ? చేతిలో ఒక్కఅణా మాత్రమే వుంది. టిక్కెట్టు ఖరీదు బేడ. ఎలాగ?.......... ఇంతలో ఆ రంగులరాట్నం వాడువచ్చి,



"ఏయ్ అబ్బాయి, టిక్కెట్టు లేందే నువ్వెక్కడానికి వీల్లేదు. ఫో" అన్నాడు. పాపం, గోపు చిన్న ముఖం చేసుకొని, అక్కడ్నించి వెళ్లిపోయాడు.

అలా విచారంగా వెడుతూ వుండగా వుండగా, గోపుకి ఆకలి వేసింది. ఆకలివేయడంతోటే అమ్మ జ్ఞాపకం వచ్చింది. ఇంటి దగ్గరవుంటే, ఆవేళకి, అమ్మ వేడి వేడి బువ్వకలిపి, కడుపునిండా పెట్టేది. అమ్మ, వెండికంచంలో బువ్వకలిపి, వంటింటి గుమ్మం దగ్గర, తనకోసం కనిపెట్టుకుని కూచుందేమో, అనుకున్నాడు గోపు. పోనీ ఇంటికి వెడితే?.... ఛీ! నేను వెళ్లను. అనుకున్నాడు.

గోపు నడుచుకుంటూ కొంత దూరం వెళ్లేడు. బలే! కమ్మటి వాసన! బలే! మిఠాయి దుకాణం! తీపి తీపి జిలేబి, పూస



పూస లడ్డు, అన్నీ వున్నాయి, ఆమిఠాయి దుకాణంలో. ఆయ్ హాయ్! చక్కగా తినడానికి కావలసినన్ని లడ్డూలున్నాయి.

"ఓయ్, మిఠాయివాడా, నాకోలడ్డుండ ఇవ్వవూ?"

"లడ్డూ ఒక్కొక్కటి పావలా"


"అయ్యో, నాదగ్గర ఒక అణా వేవుంది. నాకు ఆకలేస్తోంది. ఎలాగ?"

"అణాకి లడ్డూరాదు. ఇంద ఈ పొట్లంతీసుకో. పో"

గోపు ఆపొట్లం విప్పిచూసేడు. అందులో నాలుగు పకోడీలు వున్నాయి. ఆనాలుగు పకోడీలు తిని, వీధికొళాయిదగ్గర కడుపు నిండా మంచినీళ్లు తాగేసి, మళ్లీ బయలుదేరేడు.

అలా వెళ్లగా వెళ్లగా ఒక పెద్ద పార్కు కనబడింది. ఆ పార్కులో ఎక్కడచూచినా కలకలలాడుతూ పిల్లలందరు సరదాగా ఆడుకుంటున్నారు. కొందరు పిల్లలు ఉయ్యాలలూగుతున్నారు. కొందరు నవ్వుకుంటూ గెంతుతూ, పరుగెత్తుతూ ఆడుకుంటున్నారు. ఒకచోట రేడియో పాడుతూ వుంటే, పిల్లలు దానిచుట్టూ కూచోని వింటున్నారు. బలే! ఈ పార్కు ఎంత బాగుందో! ఎంతమంది పిల్లలో! నేను చక్కగా వీళ్లందరితో ఆడుకుంటాను. అన్నికంటే ఈపార్కే బలే మంచిచోటు. నేను ఎప్పుడూ ఇక్కడే వుండిపోతాను — అనుకున్నాడు. ఆపిల్ల లందరితో కలిసి చాలాసేపు ఆడుకున్నాడు. ఇంతలో సాయంకాలం అయింది. చీకటిపడుతోంది. పిల్లలందరు, ఒక్కొక్కరు ఇళ్లకి వెళ్తున్నారు. "గోపూ, చీకటిపడుతోంది. ఆకలేస్తోంది. ఇంటికి వెడతాం. అంటూ అందరు వెళ్లిపోయారు.

పార్కు అంతా నిశ్శబ్దం. గోపు మాత్రం దిగులుగా బిక్కమొహంతో, ఒంటరిగా, ఒక బెంచీమీద కూచున్నాడు. ఛీ! ఈపార్కు ఏమీ బాగులేదు. అనుకున్నాడు. ఆకలేస్తోంది. ఇంటి



దగ్గర అమ్మ, కమ్మని నెయ్యివేసి వేడి వేడి చారూబువ్వ, పాలూ బువ్వ కలిపిపెట్టడం జ్ఞాపకం వచ్చింది. అలా అమ్మని తలుచుకుంటూ కూచున్నాడు. ఇంతలో ఒక మిలిటరీ సిపాయి అక్కడికి వచ్చాడు.

"ఎవరబ్బాయీ, నువ్వు?"

'నేను గోపుని.'

"ఏమీ ఇలా విచారంగా వున్నావు?"


గోపు ఏడుపుముఖంతో సంగతంతా చెప్పేడు. తనకి ఇంటిమీద కోపంరావడం, అన్నిటికంటే బలే మంచి చోటుకోసం తను బయలుదేరడం, రంగులరాట్నం, మిఠాయి దుకాణం, పార్కు మొదట బాగున్న తరువాత బాగులేక పోవడం, ఈ కథంతా చెప్పేడు.

సిపాయి, గోపుసంగతంతా తెలుసుకొని తనలో నవ్వుకున్నాడు. "అబ్బాయీ, నేను ఈ ప్రపంచంలోవున్న దేశాలన్నీ చూచివచ్చేను. అన్నిటికంటే బలే మంచిచోటు ఏదో నాకు తెలుసును. నాతోరా. నీకు చూపెడతాను." అన్నాడు.

గోపు లేచి ఆ సిపాయివెంట బయలుదేరేడు. ఇద్దరూ ఆపార్కు దాటేరు. మిఠాయి దుకాణం దాటేరు. రంగులరాట్నం దాటేరు. ఇంకా అలా రాగా రాగా పెద్ద మేడఇల్లు కనబడింది. ఎవరిది? మనగోపు ఇల్లే! అదుగో, గేటు దగ్గర గోపుఅమ్మ! గోపుకోసం వీధులో చూస్తూ నిలుచుంది.

గోపు అమ్మని చూసేడు. ఒకటే సంతోషం! గబగబా పరుగెత్తుకుంటూవచ్చి, అమ్మని గట్టిగా పట్టేసుకున్నాడు.

ప్రపంచంలో అన్నిటికంటే బలేమంచిచోటు మనఇల్లే-అని అప్పుడు తెలుసుకున్నాడు గోపు.




# గుడ్లగూబయ్య




గుడ్లగూబయ్యగారు గుడ్లు తిప్పుతూవుంటే చూడడానికి బలే తమాషాగా వుంటుంది.

గూబయ్యగారిని తయారు చేయడానికి రెండు చదరపు కాగితాలు తెచ్చుకో. మొదటి బొమ్మలో లాగ ఒక కాగితంమీద బొమ్మరాసి, కళ్లు, నోరూ వున్నచోట చిన్నకత్తిరితో గాని, బ్లేడుతో గాని, కాగితాన్ని కత్తిరించు. రెండో చదరంమీద నల్లగా రెండు చుక్కలు, నోరురాయి. ఈ చుక్కలూ, నోరు, మొదటి చదరం కన్నాలకి సరిపోవాలి.



తరువాత, మొదటిచదరం కాగితం వెనుక ఈ రెండో చదరం పెట్టి, నీ చేత్తో వెనుక కాగితాన్ని ఇటూ అటూ తిప్పితే, గుడ్లగూబయ్యకళ్లు బలే తమాషాగా తిప్పుతాడు. నోరుకూడా మాట్లాడుతున్నట్టుంటుంది.




బొమ్మలు: చక్కా బ్రహ్మానందం (పాలకొల్లు)

# మాటలు నేర్చుకో

బాలా! ఈ దిగువ మూడుఅక్షరముల మాటలు, మధ్య "క" అనే అక్షరంతో ఉన్నవి యిచ్చాను. ఆమాటల అర్థాలు వాటి ఎదురుగా యిచ్చాను. ఏదీ, పెద్దలను అడగకుండా పూర్తిచేయి!

1 — క — : స్త్రీధరించేవి
2 — క — : గుడిసెలు
3 — క — : జావ కాచెదరు
4 — క — : కిల్లీలో వేసేవి
5 — క — : రూపాయలు
6 — క — : లేళ్లు
7 — క — : నీళ్లుతోడేవి
8 — క — : మామిడికాయలో ఉండేవి
9 — క — : అరుపులు
10 — క — : ఏ ఆకన్నా తినేవి!
11 — క — : పసి "బాల" కవుసరం
12 — క — : కోతులకు ఇవే అందము.
13 — క — : "బాల"ను చూస్తే ఎగరవేస్తాం
14 — క — : వీటిలో ముల్లులుంటవి జాగ్రత్త!
15 — క — : మందలు
16 — క — : గోదావరిలో వుంటాయి
17 — క — : జాబులు
18 — క — : తిన్నగాలేనివి

కూర్పు: కిలపర్తి అప్పారావు (విశాఖపట్నం)




కానన్ ష్మిట్ కు

వేలూరి శివరామశాస్త్రి

అనుసరణం

# ముత్యాలు

ఆరేబియా దేశంలో ఎటు చూచినా వందల మైళ్ల కొలదీ ఎడారులు ఉన్నవి. ఆ యెడారులలో ప్రయాణాలు చేసేవారికి కొన్ని వారాలదాకా ఊళ్లూ పట్నాలూ తగలవు. మకాం చేయడానికి మర్రిచెట్టయినా దొరకదు. కాకి కనబడని అటువంటి ఒక ఎడారిలో ఒక బాటసారి దారి తప్పాడు. అతడు ఆకలికీ, దప్పికీ, చచ్చిపోయే చందంగా ఉన్నాడు. అట్టి సమయంలో ఖర్జూరపు చెట్టొకటి వానికి కనబడ్డది. కాని పక్కగా ఊటనీరు మెరుస్తున్నది. ఆచెట్టుకొక మూట అని ఉన్నది. ఇవన్నీ చూడగానే వాని ప్రాణాలు లేచి వచ్చినై. "దేవుడా ఇదంతా నీ మహిమా" అని వాడనుకున్నాడు. "ఇది అన్నపు మూట కావచ్చు; నాకిక చావులేదు" అని అనుకుంటూ అతడామూట విప్పి చూచి—"అబ్బే ఇవి ముత్యాలు" అని వాపోయి అక్కడే పడేశాడు.

ఆకలితో చచ్చే వానికి అన్నం కావాలిగాని ముత్యాలు ఎందుకు? అవి కడుపు నింపుతయ్యా కాలు నింపుతయ్యా?

ఆ బాటసారి లక్షలు విలువచేసే ఆ ముత్యాలమూటపక్క మూలుగుతూ మూలుగుతూ యమ

యాతన పడుతూ ఇక ప్రాణాలు ఎగిరిపోతాయని అనుకుంటూ చాలా భక్తితో భగవంతుని ఆఖరుసారి ప్రార్థించి కనులుమూ చేరికి ఒంటెమీద గబగబా ఒక డక్కడికి వచ్చాడు. ఆముత్యాల మూట అక్కడ పారవేసుకుని పోయినవాడతడే. అతడు తన పోయిన మూట దొరికినందుకు సంతోషిస్తూ ఆ పేద బాటసారి మీద దయకలిగి ఇన్ని రొట్టెలూ ఇన్నిపండ్లూ పెట్టాడు. బాటసారికి ప్రాణాలు కుదుటబడ్డవి. అంతట అతడా బాటసారిని తనఒంటె మీద ఎక్కించుకొని అతనిఊళ్లో దిగబెడుతూ ఇలా అన్నాడు.

"పరమేశ్వరుని తోవలు ఎంతో విచిత్రాలు. నాముత్యాలు మూట ఇక నీటిమూటే అనుకొని ఆదారినే యింటికి పోదామని అనుకున్నాగాని నిన్ను బతికించడానికిన్నీ నాముత్యాలు మళ్లా నాకు దొరికించడానికిన్నీ దేవుడు నన్ను వెనుకకు నడిపించాడు."

పరమ సర్వజ్ఞత పరమేశ్వరుండు
వేలవేలవిధముల వెలి పుచ్చుచుండు

★

# పచ్చలూ కెంపులూ

ఒక గొప్పయింటి ఆడబడుచు ఇంత బంగారమూ, ఇన్ని పచ్చలూ, ఇన్ని కెంపులూ రామాచారి అనే అగసాలెకిచ్చి బంగారు పతకం చేసి అందులో పొదగమని చెప్పింది.

భీమాచారి అనే కుర్రాడు రామాచారి చేతికింద పనిచేస్తున్నాడు. అతడు ఆ పచ్చలయూ కెంపులయూ రంగూ కాంతీ చూస్తూ రెప్పలు వాల్ప లేకపోయాడు.

రామాచారి పని ప్రారంభించాడు. పని చురుకుగా సాగిపోతూంది. పచ్చలు పొదగవలసిన సమయంలో రామాచారికి రెండు కనబడలేదు. వెంటనే భీమాచారిమీద అనుమానం పోయింది. అంతట అతడు భీమాచారిగది అంతా సోదాచేయగా ఏమీ కనబడలేదు. తుదకు గోడ ఎక్కి దానిమీదవున్న దూలపు తొర్రలో రెండు పచ్చలనూ పట్టుకున్నాడు.

"రామ రామా! నేనేమీ ఎరగ"నని భీమాచారి మొత్తుకున్నాడు. రామాచారి వాసిని తిట్టి తిమ్మి—"నిన్ను పోలీసుల కప్పగించక పోవడం నీ పూర్వ పుణ్యం. నా యింట్లోంచి యిక లేచిపో" అని తగిలేశాడు.

ఆ మరునాడు మళ్లా ఇంకో పచ్చ కనబడలేదు. రామాచారి వెతకగా వెతకగా మళ్లా అది ఆ తొర్రలోనే దాక్కుంది. అతడీ దొంగ ఎవడో పట్టుకుందామని చాటుగా కూచుని చూస్తుండగా ఇంట్లో గూడుపెట్టిన పిచ్చుక ఒకటి వచ్చి ఒక కెంపును ముక్కున పొడుచుకొని టువ్వున గోడమీది కెగిరి తొర్రలో పెడుతూంది.

ఏమీ ఎరగని భీమాచారిని వెళ్లగొట్టినందుకు రామాచారి చాలా విచారపడి అతనిని తన దగ్గరకు పిలిపించుకొని తాను అతనిమీద నింద మోపినందుకు పరిహారంగా అతనికొక ఉంగరం బహుమతి చేశాడు.

ఇతరుల నిందించునెడల జాగ్రత్త
కడపట నీనింద కావచ్చు రిత్త

★

# స్ఫటికాలు

వయసులోవున్న వరదయ్య తాగుడుకు అలవాటుపడి తాగి తాగి మహాచెడ్డరోగం తెచ్చుకున్నాడు.

వైద్యుడు వచ్చిచూచి "నీకు చావు మూడింది. దిక్కుమాలిన చావు చస్తావుసుమీ! సారా అంటే ఏమనుకున్నావో తాచుపాము విషంకంటె ఎక్కువ" అని అన్నాడు.

"అది లేకపోతే నేను బతకలేను. నాకు మితీమేరా లేని అలవాటు అయింది. అదిగో! ఆ సీసా చూచారా? దానెడు తాగకపోతే మరిబతకను. ఒక చుక్కయినా తక్కువఐతే చావే" అని వరదయ్య చెప్పుకున్నాడు.

"అలాగా? దీనికో మందు చెబుతానుండు" అని ఆ వైద్యుడు వెళిపోయి ఆ మరునాడు కొన్ని చిన్న చిన్న స్ఫటికపు రాళ్లు తెచ్చి "ఇదిగో! రోజూ ఒక రాయి యీ సీసాలోవేసి తాగుతూ ఉండు. వేసినరాయి మళ్లా తియ్యకూడదు. ఇలావేసి తాగితే నీకు

సారా అపకారం చేయదు" అని చెప్పి వెళిపోయాడు.

వరదయ్య సారాలో విషం విరిచిపారేసేశక్తి ఆరాళ్లలో ఉన్న దని అనుకొని వైద్యుడు చెప్పి నటులు చేయడం మొదలు పెట్టాడు.

రోజూ ఒకరాయి ఆ సీసాను ఆవరించడమువల్ల దానిలో సారా క్రమక్రమంగా తగ్గుకుంటూ రావడము మొదలు పెట్టింది. కొద్ది కొద్దిగా తగ్గడమువల్ల వరదయ్యకు తెలియడములేదు. చివర రాయి వేసేతలికి సీసా నిండి సారాకు అవకాశం లేకుండా పోయింది. వరదయ్య వ్యాధిగూడా పోయింది.

ఒక్కొక్క దినమున నొక్కొక్కతప్పు
దిద్దితేఁ జేరదు దివ్యమా చొప్ప

★

# ఒక బస్తా మన్ను

చాలా డబ్బా పలుకుబడీఉన్న ఒక పెద్దమనిషి తనతోట కానుకొనిఉన్న ఒక పేదరాలి పొలం కాస్తా కలుపుకున్నాడు. ఆ పెద్దమనిషి ఒకనాడు తాను అపహరించిన ఆ పొలంచెక్కలో షికార్లు కొడుతూ వుంటూండగా ఆ పేదరాలు ఖాళీబస్తా ఒకటి మూపున వేసుకుని అక్కడికివచ్చి ఆ పెద్దమనిషికి దండం పెట్టి "అయ్యా! తమను వరమొకటి అడగడానికి వచ్చాను. తమరు వద్దనరు. నాకు తెలుసు. నాకు నాచేలో మన్ను ఒక బస్తానిండా ఇప్పించాలి" అని కన్నీరు ఒత్తుకొంటూ వేడుకుంది.

"పిచ్చిదానా! అలాగే తీసుకో. ఇటువంటి కోరికలకు ఎవరూ అడ్డుచెప్పరు" అని ఆ పెద్దమనిషి అన్నాడు.

ఆ పేదరాలు బస్తానిండా మన్ను నింపింది. పిదప "అయ్యా! ఇంకొక మనవి. ఈబస్తా నా బుజముమీదికెత్తాలి" అనివేడుకుంది.

ఆ పెద్దమనిషి ఎన్నడూ పాటుచేసిన పాపాన పోలేదు కాబట్టి 'ఛా! నా చాతకాదుపో' అని అన్నాడు.

"అయ్యా కరుణించండి, దిక్కులేని దానిని. నా కెవరూ సాయమురారు. ఎలాగో ఒకలాగ నాపూది కెత్తండి" అని బతిమాలగా బతిమాలగా అతడు ఒప్పుకొని ఎత్తడానికి ఉంకించి ఉంకించి "అరి బాబో! ఇది నేనెత్తలేను" అని అన్నాడు.

అప్పుడా పేదరాలు "ఈ బస్తామట్టి బరువే తమరు ఎత్తలేకపోతే లక్షల బస్తాలమట్టి బరువును కల కాలమూ మొయ్యాలని ఎల్లా సాహసించారండీ?" అని అన్నది.

ఆ లోభికి ఈ మాటలు సూటిగా తగిలినై. అతడు వెంటనే ఆమె పొలం ఆమెకిచ్చి యిలా అనుకున్నాడు:

బలిమిని మోసానఁ బడసిన సొమ్ము
అంతరాత్మకు కూడదని నాటు నమ్ము.

★

# పువ్వులతో రాణీ

బాలా!
ఇది
పూల బాల!




తలా, ఒళ్లూ,
కాళ్లూ, చేతులూ
అన్నీ పూలే!



# అపకారికి ఉపకారము

రచయిత : మల్లంపల్లి సోమశేఖరశర్మ

ప్రసాదరావు ఉదయాన్నే లేస్తాడు. దైవప్రార్థన చేసుకుంటాడు. రోజూ స్నానంచేస్తాడు. చక్కగా తలదువ్వుకుని, శుభ్రమైన బట్టలు కట్టుకుంటాడు. బాగా చదువుకుంటు, సాయంకాలం చెమట పట్టునట్లు ఆడుకుంటాడు. ఇన్ని మంచిగుణాలు ఉన్నాయి కాబట్టి అతనిని అందరు మంచి పిల్లవాడని మెచ్చుకుంటారు.

ప్రసాదరావు వాళ్ళ బడిలోని బాలవీర సంఘములోచేరి బాలవీరుడు కూడా అయ్యాడు.

ప్రసాదరావు అందరితోను స్నేహముగనే ఉండేవాడు.

ప్రసాదరావు తరగతిలో వెంకటరావు అనే బాలుడున్నాడు. ప్రసాదరావుని అందరు మెచ్చుకోవటం వెంకటరావుకి కష్టంగ తోచింది. ప్రసాదరావుని ఎట్లాగైనా కష్టపెట్టి, వాడి మంచిపేరు పోగొట్టాలని వెంకటరావు ప్రయత్నం చేస్తున్నాడు. ఈసంగతి ప్రసాదరావుకి తెలియదు. ప్రసాదరావు మామూలుగానే వెంకటరావుతో కూడా స్నేహంగానే వుంటున్నాడు.

చెడ్డవాడికి అందరు చెడ్డవాళ్ళులాగ కనిపిస్తారట. పూర్వం దుర్యోధనుడికి ప్రపంచంలో ఎక్కడా మంచివాళ్ళు కనబడలేదట. ధర్మరాజుకు ప్రపంచంలో ఎక్కడా చెడ్డవాడే కనబడ లేదన్నాడట. అట్లా ఉన్నది వెంకటరావు ప్రసాదరావు సంగతి!

ఒకనాడు తరగతిలో వెంకటరావు లేచి తన తెలుగుపుస్తకం పోయిందంటూ మేష్టారికి పితూరి జేసాడు. 'ఎవరు తీసేసారో?' అంటూ ఏడుపుకూడా ప్రారంభించాడు. పాఠం ఆగిపోయింది. అందరు తెల్లబోయారు. అందరు పుస్తకాలు వెతుక్కున్నారు. ప్రసాదరావు వెతకలేదు. అతడెందుకు వెతకలేదో తెలుసునా? 'నేను తియ్యలేదుకదా, ఎందుకు వెతకడం' అని మామూలుగ కూర్చున్నాడు.

మేష్టారు 'ఎవరిమీద నీకను మానం ఉంది?' అన్నాడు. 'ప్రసాదరావు మీదండి' అన్నాడు వెంకటరావు. అందరికి ఆశ్చర్య మేసింది. మేష్టారు కూడ ఆశ్చర్య పడుతు 'ఏంరా' అన్నారు ప్రసాదరావుని.

'కావలిస్తే చూసుకోమనండి, ఇవిగో నాపుస్తకాలు' అని ప్రసాదరావు ధైర్యంగా పుస్తకాలు తీసి చూపించాడు. అతను తీస్తేగా? భయపడేందుకు.

'ఇంతధైర్యంగ చెపితే చూడ రేమోనని దొంగలిల్లాగే అంటా రండీ,' అంటూ వెంకటరావు పుస్తకాలు తీసుకొని, అందు లోంచి తన తెలుగు పుస్తకం తీసుకున్నాడు! ప్రసాదరావు ఆశ్చ ర్యపోయాడు! ఏమీ బోధపడ లేదు. తను తియ్యనిదే తనపుస్త కాలలోకి వాడి పుస్తకం ఎట్లా వచ్చిందో తెలియలేదు. తను తియ్యలేదంటే ఎవరు నమ్ముతారు?

పాపం, మేష్టారు కొట్టారు. పిల్లలు 'దొంగ దొంగ' అన్నారు. అవమానం భరించలేక పోయాడు. వెంకటరావు అదోలా చూస్తూ నవ్వుతున్నాడు. ప్రసాదరావు తరువాత పీరియడులో వెళ్ళి స్కౌటు మేష్టారితో ఏడుస్తూ ఈసంగతి చెప్పాడు.

స్కౌటు మేష్టారువిని, 'వెంక టరావు నీపుస్తకాలను వెతికి తెలుగు పుస్తకాన్ని తీసుకు న్నాడా?' అన్నారు.

'అవునండి. నా అట్లాసులో ఉందండి.'

'సరిగా అట్లాసునే వెతికాడా లేక ఇతర పుస్తకాలు కూడా వెతి కాడా?'

'సరిగ్గా అట్లాసులోంచి ఆ పుస్తకాన్ని తీశాడండి'

'అట్లాచెప్పు. నువ్వు క్లాసు లోంచి బయటకెళ్ళావా?'

'అవుట్ బెల్ కి బయటికి వెళ్ళా నండి.'

'అవుట్ బెల్ తరువాత పిరి యడులోనే కాదూ, వెంకట రావు రిపోర్టు చేసింది?'

'అవునండి,'

'అయితే ఇంకేం, నీవు అవు టుకివెళ్ళగానేచూచి నీపుస్తకాల్లో వెంకటరావే తన పుస్తకాన్ని పెట్టి వుంటాడు. కాబట్టే వాడు నీ అట్లాసు పుస్తకంలో నుంచి,

ఏమీ వెతకకుండానే చటక్కున తీసి చూపగలిగాడు.' అన్నారు తెలివైన స్కౌటు మేష్టారు. ప్రసాదరావు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ ఆశ్చర్యంగ చూసాడు.

'విచారించకు. గాంధీ అంతటి మంచివాడినే ఎవరో చంపాలని ఆయన మీద బాంబు విసిరారట! మంచివాళ్ళ తరుపునా భగవంతు డుంటాడు. భగవంతుడు మనపక్కనుంటే మన కేం భయం?

చెడ్డవాళ్ళకి చెడ్డపనులను చేయడమే స్వభావం. మంచివాళ్లకి మంచిపనులు చేయడమే అలవాటు కనుక వెంకటరావును ఏమీ చేయక స్నేహితునిగనే చూసుకుని ప్రేమిస్తూండు అని స్కౌటు మేష్టారు చెప్పారు. మేష్టారి మాటలవల్ల ప్రసాదరావుకి ఎంతో ఉత్సాహం కల్గింది.

చాలరోజులు గడిచాయి. ప్రసాదరావుమీద వెంకటరావు ఇంకా చాలా లేనిపోని నేరాలు మోపాడు. కాని ప్రసాదరావు ఏమీలెఖ్ఖ చేయలేదు. ఇదివరకులాగే ప్రేమతో చూస్తున్నాడు.

ఒకనాడు ఇద్దరుపిల్లలు వెంకటరావుని కిందపడేసి బాదుతున్నారు. ఆ చుట్టుపక్కల ఎవరు లేరు. ప్రసాదరావు ఏదో పనిమీద ఆ దారిని పోతున్నాడు. వెంకటరావుని కిందపడేసి మిగతా ఇద్దరుకొట్టడం చూచాడు. వెంటనే పరుగెత్తికెళ్ళి, వాళ్ళిద్దర్ని కొట్టి వెంకటరావుని విడిపించాడు. వెంకటరావు, ప్రసాదరావుని చూచి తలవంచుకున్నాడు.



వెంకటరావు ఇల్లా గనుకున్నాడు: "అరెరే! ప్రసాదరావుని ఎన్ని కష్టాలు పెట్టినా, నామీద వాడికి కోపమేలేదుగదా! నిష్కారణంగ, అన్యాయంగ వాడిమీద ఎన్ని పితూరీలు చేసానో!! ఛీ ఛీ. వెధవ బ్రతుకు నాది. బ్రతికినంత కాలం మంచివాడల్లే బ్రతకాలి గాని చెడ్డవాడనిపించుకుని బ్రతకకూడదు." వెంకటరావు తనలో చాలా విచారించాడు.

ప్రసాదరావు వెంకటరావుని నడిపించుకుంటూ వస్తూన్నాడు.

వెంకటరావు కుంటు తున్నాడు. దారిపొడుగునా ఎవ్వరుమాట్లాడు కోలేదు. వెంటరావు ఇంటిదాకా తీసికెళ్ళి 'వెడతాను వెంకటరావు' అన్నాడు ప్రసాదరావు.

'మాట' అనిపిలిచి, వెంకటరావు ప్రసాదరావు చేతులు పట్టుకొని, "క్షమించు ప్రసాదరావూ; నేను నీకు చాలకష్టాన్ని కల్గించాను. నన్ను క్షమించి నీ స్నేహితునిగ చేసుకోవూ?" అని అడిగాడు.

'ఏంచేశావులేద్దూ. వెళ్ళి కాలి కేదైనారాసుకో. రేపు మళ్ళా వస్తాను.' అని ప్రసాదరావు సంతోషంతో ఇంటికి వెళ్ళాడు.

అప్పటినుండి వాళ్ళిద్దరు ప్రాణ స్నేహితులయ్యారు. వెంకటరావు కూడ చక్కని బాల పేరుకుగ తయారయ్యాడు. ఇప్పుడు ఎవ్వరి మీదా పితూరీలు చేయడు. అం దర్నీ ప్రేమిస్తాడు. అందరికి చేత నయిన సహాయం చేస్తాడు.


# కావలెను రూ. 50,000 లు ఆస్తిని పొందుటకు అదృష్ట బాలుడు కావలెను


ఆంధ్ర, వైదీకి (వెలనాడు), శ్రీవత్సస గోత్రం గౌరవ కుటుం బములో పుట్టిన, మూడు సంవత్సరముల లోపు చక్కని బాలుడు ఒకానొక బ్రాహ్మణ ధనికునకు అభిమాన పుత్రుడుగా కావలెను.

కనీసము రూ. 50,000 ఆస్తి రాసి ఇవ్వబడును.

వివరములకు:— బాక్సు 1, "బాల" ఆఫీసు, మైలాపూరు, మదరాసు. 4 అని వ్రాయండి.

# ఆరుగురు బాలురు

బాలా! ఈ ఆరుగురు బాలురూ ఎంత గమ్మత్తుగావున్నారో! ఆ వుంగరాలజుత్తు, ఆ కనుబొమ్మలు, ఆ కళ్లు, ఆ నాలుకలు—బలే తమాషాగా వెక్కిరిస్తున్నారు...అందరూ ఒక్కలాగేవున్నారు-కాని-




వీరిలో ఇద్దరు కవలపిల్లలున్నారు. ఏ ఇద్దరూ కవలపిల్లలో బొమ్మలు జాగ్రత్తగా చూచి పోల్చుకోగలవా?

(జవాబు ఈ సంచికలోనే వుంది)

# హనుమంతుని చదువు

బాలలూ !

హనుమంతుడు ఎవరో తెలుసునుకదూ ?

ఈ హనుమంతుడు చిన్నప్పుడు ఎలాగ చదువుకున్నాడో ఒక గమ్మత్తయినకథవుంది. చదువు.

హనుమంతుడు పుట్టగానే కోతిచేష్టలు చేయడం మొదలెట్టాడు. అయినా, చదువుకోవాలని బుద్ధిపుట్టింది. ఎవరిదగ్గర చదువు నేర్చుకోవడమా అని ఆలోచించాడు. సూర్యుడు ప్రపంచానికి వెలుతురిస్తున్నాడు. ఆ సూర్యుడికి అన్నివిద్యలూ, అన్నిశాస్త్రాలూ వచ్చును. అంచేత సూర్యుడిదగ్గర చదువు నేర్చుకోవాలని అనుకున్నాడు. ఒకనాడు పొద్దున్నే చీకటితోలేచి, స్నానంచేసి, ఉదయిస్తూవుండే సూర్యునికి నమస్కారంచేసి ఇలాగ ప్రార్థించేడు.

"ఓ సూర్యదేవుడా ! ప్రపంచానికంతటికీ వెలుతురిస్తున్నావు. నీవే నా గురువు. నేను నీకు శిష్యుడను. నాకు విద్యచెప్పవూ?" అని ప్రార్థించేడు.

సూర్యుడు సంతోషించి, "హనుమంతా ! నీవు కోరినట్లు చదువు చెబుతానుగాని భూమి మీద నిలుచొని నీవు నాదగ్గర ఎలాగ చదువుకోగలవు? నేను ఆకాశంలో తిరుగుతూవుంటాను. ఉదయిస్తాను. అస్తమిస్తాను. ఒక చోటనే వుండను. నా దగ్గరకు నీవు ఎలాగ రాగలవు? నేను చూస్తే పెద్ద నిప్పుబంతిని. భూమికీ నాకూ ఎంతో దూరం వుంది. ఎలాగ?" — అని సూర్యుడు అన్నాడు.

నిజమే ! ఎలాగ? భూమి తనలోతాను గుండ్రంగా తిరుగుతూ వుంటుంది. అంచేత కొంత భాగం పగలు, కొంతభాగం రాత్రి అవుతూ వుంటుంది. భూమి సూర్యుడికి ఎన్నోకోట్ల మైళ్లదూరంగావుంది. హనుమంతుడు ఎలాగ పాఠాలు రోజూ సూర్యుడి దగ్గర నేర్చుకోగలడు ?

హనుమంతుడు బాగా ఆలోచించాడు. ఎలాగేనా సూర్యుడిదగ్గరే చదవాలని పట్టుదలపట్టేడు. సూర్యుడితో ఇలా అన్నాడు.


"గురువుగారూ ! మీరు చదువు చెబుతాను అని అంటే చదివేఉపాయం నేను ఆలోచించు

తాను. ఇరవైనాలుగు ఘంటలూ మీకు ఎదురుగానేవుండి పాఠాలు నేర్చుకుంటాను" అని అన్నాడు.

సూర్యుడు సరే అన్నాడు. అప్పుడు హనుమంతుడు ఏం చేశాడో తెలుసా?

ప్రపంచంకంటే పెద్దగా తన శరీరాన్ని పెంచాడు. ఆకాశం అంత ఎత్తుగా ఎదిగాడు. భూమికి పడమటిదిక్కు చివరన ఒక పాదము, తూర్పు దిక్కుచివరన ఒక పాదమూ ఉంచి నిలువుగా నిలుచున్నాడు! (బొమ్మచూడు.) అలాగ నిలబడి సూర్యునికి ఎదురుగా ముఖం త్రిప్పుకుంటూ చదువుకోడం మొదలు పెట్టాడు!

భూమికంటే పెద్దగా పొడుగ్గా వుండడం మూలాన్న హనుమంతుడికి పగలూ రాత్రీ కూడా సూర్యుడు కనుబడుతూ వుండేవాడు. అలాగ ఒక నిముషమేనా వదలక, ఎంతో శ్రద్ధతో సూర్యుడిదగ్గర హనుమంతుడు విద్య నేర్చుకున్నాడు. కొన్నాళ్లకు అలాగ అన్ని విద్యలూ నేర్చుకొని గొప్ప పండి



తుడూ, బుద్ధిమంతుడూ అయాడు.

చూశారా! హనుమంతుడు కోతి అయినప్పటికీ, శ్రద్ధ, పట్టుదలతో కష్టపడి విద్యనేర్చుకొని, గొప్ప పండితుడు, బుద్ధిమంతుడు అయాడు. మనలో కొందరు విద్య, బుద్ధిలేక కోతిచేష్టలుచేసి "కోతిపిల్లకాయలు" అని బిరుదు పొందుతున్నారు.

మీరు కోతిపిల్లకాయ లవుతారా లేక బుద్ధిమంతులు విద్యావంతులు అవుతారా?

★ నా నా ★




## పాదుకా పట్టాభిషేకము!

అయోధ్యకు రాజు దశరథుడు
ఆయన కుమారుడు రాముడు
ఇతని భార్య సీత
ఈమె చక్కని చుక్క
ఉభయులకు రాజ్యం ఇస్తానని
దశరథుడు అన్నాడు
ఊరివారందరూ బాగుందన్నారు
ఋషులుకూడా సంతోషించారు
ఎవరో వచ్చారు
ఏదో చెప్పారు
ఐతే, నాకొడుకే రాజుకావాలని
కైక ఏడ్చింది
ఒక్క దెబ్బని రాముణ్ణి అడవికి
పంపింది
ఓ రామా! అంటూ దశరథుడు
మరణించాడు.
ఔరా! ఎంతపని జరిగింది!
అంటూ భరతుడు అడవికి
వెళ్లి రామపాదుకలు తెచ్చి
పట్టం కట్టాడు.
అందరూ ఆశ్చర్య పోయారు.
అః ఏమి సోదర ప్రేమ!

రచన: వేమరాజు సుభద్రాదేవి

# దువ్వెన గారడీ!

సంపాదన: కొట్రా సరోజిని (నెల్లూరు)

బాలా!

నీకు ఈగారడీ తెలుసునా? తెలియకపోతే చెప్తాను నేర్చుకో!

ఈ గారడీ నువ్వు తలంటి పోసుకున్నరోజున చేయాలి.

ముందుగా ఒక పాతకాగితం చిన్న చిన్న ముక్కలుగా చించు. ఆ కాగితం ముక్కలు టేబిలు మీాదవుంచు. తరువాత ఒక దువ్వెన చేతితో పట్టుకో. కర్ర దువ్వెన, కొమ్ముదువ్వెన, దంతం దువ్వెన పనికిరావు, ఇప్పుడు బజారులో కొత్తగా అమ్ముతున్నారు ప్లాస్టిక్ దువ్వెనలు— ఆ దువ్వెన కావాలి. ఆదువ్వెనతో నీతలదువ్వుకుంటూ ఇలాగ ఉపన్యాసం చెయ్యి.





"సోదర సోదరీమణులారా! ఇదుగో చూడండి. ఈ టేబిలు మీాదఉన్న కాగితంముక్కల చేత సర్కస్ చేయిస్తాను. నేను చెప్పినట్లు ఈ కాగితంముక్కలు భరతనాట్యం చేస్తాయి. ఇదుగో చూడండి—ఓం! కాళీ! మహాం కాళీ! అంబ! జగదాంబ! రాజా! నారాజా! నటరాజా! ఆడవే! తైతకలాడవే! ధింతకలాడవే!" అంటూ, నీ జుట్టును, దువ్వెనతో గబ గబ దువ్వుకుంటూ, ఆదువ్వెనను కాగితంముక్కలకు కొంచెం ఎత్తుగా పెట్టు.



కాగితపు ముక్కలు ఎగిరి దువ్వెనకు అంటుకుంటాయి! అవి అంటుకునేలోపల దువ్వెనను పైకిమెత్తితే అవి మళ్లీ కిందిగి పడిపోతాయి. దువ్వెన ఇటూ, అటూ, తిప్పితే కాగితంముక్కలు కూడా ఆ దువ్వెనవైపు పరుగిడుతాయి. ఇలాగ ఆ కాగితం ముక్కల్ని గెంతించి తమాషాచేయవచ్చును. కావలిస్తే చేసిచూడు. ఈ గారిడీ ఎవరు నేర్పేరు అంటే- "బాల"లో చదివేనని ఎవ్వరితోనూ ఈరహస్యంచెప్పకుమాా!



# రాజుకు తగిన బంట్లు



రచన : అడపా రామకృష్ణరావు

జర్మనీ దేశంపేరు మీరు విని వుంటారు. జర్మనీ దేశాన్ని పూర్వం "ప్రష్యా" అని పిలిచేవారు. ఆ ప్రష్యా దేశాన్ని ఒకప్పుడు ఫ్రెడరిక్ అనేరాజు పరిపాలించాడు. ఆరాజు చాలా చదువుకున్నవాడు. సంగీతమంటే చెవికోసుకునేవాడు. తల్లి అంటే చాలా భక్తి. విల్హెల్మినా అనే చెల్లెలిని ఎంతో అభిమానంతో పెంచాడు. ఇన్ని మంచిగుణాలున్నా, ఆరాజులో ఒక లోపం వుంది. ఏమిటంటే—మాటలలో తొందరఎక్కువ. ఒకసారి పొరపాటున ఏదైనా మాట అన్నాడంటే ఇక తనపట్టే తనదికాని ఎందరెన్నివిధాల చెప్పినా తన అభిప్రాయం మార్చుకొనేవాడు కాడు. ఇదొక్కటే అతనిలో లోటు.

అతనికి ఒక గుఱ్ఱమంటే చాలాయిష్టం. ఆగుఱ్ఱానికి ఒకసారి రోగం వచ్చింది. గడ్డితినడం మానివేసింది. ఫ్రెడరిక్ చాలా విచారించాడు. "ఇంత రాజ్యం వుంది. ఇంత సంపద వుంది. ఐనప్పటికీ నాకెంతో ప్రియమైన గుఱ్ఱాన్ని నేను రక్షించుకోలేక పోతున్నానుకదా" అని బాధపడ్డాడు. కాని ఎంతవైభవంవుంటే మాత్రం గుఱ్ఱం చావవలసివుంటే రాజు దానిని బ్రతికించగలడా? ఆ మాట తలచుకునేటప్పటికి రాజుకు కోపం వచ్చింది. వచ్చి "ఎవరైతే గుఱ్ఱం చచ్చిపోయిందని నాతో చెపుతారో వాళ్ళను ఉరితీయిస్తాను." అన్నాడు.

అతని సేవకులేమో భయపడ్డారు. ఎందుచేతనంటే రోజూ ఉదయం ఒకడు, సాయంకాలం ఒకడు గుఱ్ఱపుశాలకు వెళ్ళి గుఱ్ఱానికి ఎలావుందో చూచి వచ్చి రాజుకు చెప్పాలని ఆజ్ఞ. అంటే గుఱ్ఱం చచ్చిపోయినప్పుడు ఆ చూసివచ్చిన సేవకుడిప్రాణం తీయించి వేస్తాడన్న మాట.

అందుకే అందరకీ భయంగావుంది.

ఇలా కొన్నిరోజులు గడచి పోయాయి. గుఱ్ఱానికి రోగం నయంకాలేదు. రోజూ ఉదయం ఒక సేవకుడు, సాయంకాలం ఒక సేవకుడు గుఱ్ఱపుశాలకు వెళ్ళి చూచివచ్చి రాజుకు చెప్తున్నారు. మామూలుగానే కాలం గడచిపోతున్నది.

ఇలావుండగా ఒకరోజు గుఱ్ఱం చచ్చిపోయింది. ఉదయం వెళ్ళిన సేవకుడు చూచాడు. ఈవార్త రాజుగారికి చెప్తే ఉరితీయిస్తాడు. ఎలాగ? ఓ తెలివిగల సేవకుడు "సరే నేనువెళ్ళి రాజుగారికి ఈసంగతి చెప్తాను. మీరు దిగులు పడకండి." అన్నాడు. అయ్యో! నిన్ను రాజుగారు ఉరితీయిస్తారేమో—" అని వాళ్ళంటే "మతే మీ ఫరవాలేదు" అని బయలుదేరాడు.

"గుఱ్ఱానికి ఎలావుంది?" అని అడిగాడు ఫ్రెడరిక్.

"ప్రభూ! గుఱ్ఱం ఎప్పటి చోటులోనే వున్నదండి. పండుకుని వున్నదండి. కదలడంలేదండి. గడ్డి మేయడం లేదండి. నీళ్ళు తాగడం లేదండి. ఊపిరికూడ పీలుస్తున్నట్టు లేదండి. మతేమో—" అని ఇలా చెపుతున్నాడు.

"ఐతే గుఱ్ఱం చచ్చిపోయి వుండాలి!" అన్నాడు ఫ్రెడరిక్.

"ఔనండి—ఆమాట ముందుగా తమరే సెలవిచ్చారండి" అన్నాడు సేవకుడు.

ఇక రాజు ఏం చేస్తాడు? ఎవరిని ఉరితీయిస్తాడు? మెదలకుండా ఊరుకున్నాడు.

## గోరుముద్ద:

మూడు బొమ్మలతో ముచ్చటైన కథ



పాపకి అమ్మ గోరుముద్ద పెట్టేటప్పుడు
పరధ్యానంగా వుంటే ఈ బొమ్మలోలాగ
జరుగుతుంది....ఏం?

"ఈశ్వర్"



# కామయ్యగారి

రచన : దశిక వెంకటరత్నము (కాపవరం)

ఎవరికేనా అంత ఆశ వుండ కూడదు. వుంటే ఈకథలో లాగ జరుగుతుంది!

అనగా అనగా కామయ్యాలని ఒకబ్రాహ్మడు ఉండేవాడు. కామయ్య వొట్ఠి తిండిబోతు. అరిసెలు, బూరెలు, సున్నివుండలు అంటే ప్రాణం!

కామయ్యకి పొలంవుంది. ఒక చెరువుకూడా త్రవ్వించాడు. రోజూ ప్రొద్దున్నే కామయ్య పొలానికివెళ్లి మళ్లీ సాయంత్రం ఇంటికివచ్చేవాడు. మధ్యాహ్నం భోజనం చెరువుగట్టుమీదే చేసేవాడు.

ఒకనాడు రాత్రి ఒకఆవు చెరువువద్దకు వచ్చింది. కావలసినంత మేత తెల్లవార్లు మేసింది. తెల్లవారు ఝామున వెళ్లిపోయ్యేటప్పుడు చెరువుగట్టున ఒక వైపు గండిపెట్టి వెళ్లిపోయింది.

తెల్లవారింతరువాత వచ్చిచూచేడు. గట్టు ఒక వైపున గండిపడివుంది! కారణం తెలుసుకోలేక పోయాడు. తిరిగిగట్టును బాగుచేసుకున్నాడు. యధాప్రకారం రాత్రి యింటికి వెళ్లిపోయాడు.

తిరిగి ఉదయం పొలంవచ్చేడు. ఇదివరకువలెనే రాత్రి ఆవువచ్చి కావలసినంత మేసి, గట్టుకు గండి పెట్టివెళ్లిపోయింది. కామయ్యకు ఏమీతోచ లేదు. తిరిగి బాగుచేసుకుని రాత్రికి వెళ్లిపోయాడు.

ప్రతిరోజూ రాత్రికి ఆయావువచ్చి కడుపునిండ మేసి, గట్టుకుగండిపెట్టి తెల్లవారుసరికివెళ్లిపోతోంది.

# కైలాసప్రయాణం ★

ఉదయం కామయ్యావచ్చి గట్టును బాగుచేసుకొంటూ ఉండేవాడు.

ఇట్లు కొన్నిరోజులు జరిగింది. కామయ్యకు విసుగెత్తింది. ఈపని చేసేది యెవరో కనిపెట్టాలనుకొన్నాడు. ఆరాత్రి యింటికి వెళ్లలేదు. పొలములో చెరువుగట్టు మూలలను కూర్చుని కనిపెడుతున్నాడు. ఆవువచ్చింది. కడుపు నిండమేసి,గండిపెట్టి వెళ్లిపోవుటకు సిద్ధంగావుంది.

ఆ యావు చాలా అందంగా వుంది. దానిని చూచి కామయ్యా పరవశమైపోయాడు. ఆవు దగ్గరకు వచ్చిచూచేడు. ఆవు ఏమీ కదలలేదు. మరికొంచం దగ్గరకు వచ్చాడు. ఆ గోవు బయలుదేరుతోంది. వెంటనే దానితోక పట్టుకున్నాడు. ఎవరు? కామయ్యా.

ఆ గోవు జంయ్‌మని ఆకాశం మీదికి ఎగిరింది. దాని తోకపట్టుకున్న కామయ్యకూడా పైకి ఎగిరాడు. గోవు తిన్నగా కైలాసం వెళ్లింది. కైలాసంలోని వింతలు విశేషాలు అన్నీ చూచేడు కామయ్యా, ఒకచోట పెద్దపెద్ద మిఠాయిలు, ఒకచోట మరీ పెద్దపెద్ద సున్నిఉండలు, మరొకచోట పెద్దవియైన బూరెలు చూచాడు. కావలసినంత తిన్నాడు. సాయంత్రం పడింది. ఇంటికివెళ్లాలనుకొని గోవుదగ్గరకు పరుగునవచ్చి దాని తోకను గట్టిగా పట్టుకొన్నాడు. మామూలుగా ఆ గోవు చెరువు గట్టుకువచ్చింది. కామయ్యా మెల్లిగా యింటికిచేరేడు.

ఈ సంగతంతా తనభార్యకు గ్రామంలోని తన స్నేహితులకు చెప్పేడు. ఆ కైలాసములోని వింతలన్నింటికంటె తానుచూచిన బూరెలను, మిఠాయిలను సున్ని ఉండలను మాత్రం కామయ్యా ఎక్కువగా వర్ణించి చెప్పేడు.

"మాకుకూడా కైలాసం చూపించు"మని "మాకుకూడా ఆపెద్దపెద్ద మిఠాయిలు, బూరెలు, సున్ని ఉండలు పెట్టించు" మని కొందరు స్నేహితులు కామయ్యానుకోరేరు. చూడదలచుకొన్న వారందరు రాత్రికి తనపొలందగ్గరకు రమ్మని కామయ్యా పొలంచేరేడు.

కైలాసం వింతలు చూడాలని కొందరు, కైలాసంలోని మిఠాయిలు, బూరెలు, సున్నిఉండలు తిని, కొన్ని తెచ్చుకోవాలని కొందరు కామయ్యవద్దకు వచ్చేరు. మామూలుగా గోవు కైలాసం నుంచివచ్చింది. అందరు కైలాసం బయలుదేరారు. మొదట మన కామయ్య మునుపటివలె గోవు తోకనుపట్టుకొన్నాడు. కామయ్య కాళ్లు పుల్లయ్య పట్టుకున్నాడు. పుల్లయ్యకాళ్లు సూరయ్యపట్టుకున్నాడు. సూరయ్యకాళ్లు సుబ్బయ్య పట్టుకున్నాడు. వానికాళ్లు యింకొకడు, వానికాళ్లు మరియొకడు. ఈలా ఒకరికాళ్లు యింకొకళ్లుచొప్పున అందరూ గొలుసులాగ పట్టుకున్నారు.

గోవు బయలుదేరి వెళ్లిపోతూంది. అందరు తోకదగ్గరనుండి ఒకదండగా వేళ్లాడుచు వెళ్లిపోతున్నారు! చిత్రము!

కైలాసమునకు సగందూరం వెళ్లేరు. అందులో సూరయ్య, సుబ్బయ్యలకు దృష్టి బూరెలు, అరిసెలు, సున్నిఉండలుమీదకు పోయింది. వారు "సున్నిఉండలు ఎంతెంతవున్నాయి? అరిసెలు ఎంతెంత వున్నాయి? బూరెలు యెంతెంత వున్నాయి? చెప్పూ, చెప్పూ" అని త్రోవలో కామయ్యను తొందరపెట్టేరు. కామయ్యకూడా వాటియందు యెక్కువకోరికగలిగి యున్నందున ఆతురతతో గోవు తోకను వదలివేసి "ఇంతంత వున్నాయి, ఇంతంత ఉన్నాయి" అని చేతులెత్తిచూపేడు. కామయ్య చేతులు వదితేసరికి గోవు పైకివెళ్లిపోయింది. వీరందరు క్రిందపడిపోయినారు! పాపం!

## పిలుపు ఉత్తరం

New cat అగ్రహారం,

శ్రీ old town family రావు గారికి—

Aమండో E, మీరు సంక్రాంతికి మా New cat అగ్రహారానికి రమ్మని నా prayer. మీరు వస్తున్నప్పుడు Rice పరబ్రహ్మశాస్త్రిని, Ghee కృష్ణారావుగారిని, Peace లతను, Dal పుల్లయ్యగారిని తీసుకురంD. భోగీనాడు Tiger హోర, milk ముంజెలతో సహా Vందు చేస్తాను. Eట్లు—

Tin రేకుల సుబ్బారావు


కూర్పు: పరాంకుశం రాజామణి

# చక్రం పజిల్

లెక్కలు రానక్కరలేదు!
అందరూ పూర్తిచేయొచ్చు!

బాలలూ!

ఈ క్రిందిచక్రంలో ఖాళీగావున్న సున్నాలలో అంకెలు వేసి, ఏమూడు అంకెలవరుస కలిపినా ఒకే మొత్తం వచ్చేటట్లు చేయగలవా?




ఉదహారణకు: ఒకసున్నాలో 11 అంకెవుంది. దానికి సరిగా ఏటవాలుగావున్న సున్నాలో 1 అంకెవుంది. మధ్య ఖాళీగావున్న సున్నాలో నువ్వు మరోఅంకెను వేయాలి. ఏ వరుస మూడు అంకెలు కలిపినా ఒకే మొత్తంరావాలి. వేసిన అంకె వేయరాదు

సంపాదన: ఉప్రదిష్ట కృష్ణమూర్తి (మదరాసు)

(జవాబు మార్చిసంచికలో చూడండి)

# గొబ్బిజాతక కథలు



## — జోహానా గొబ్బి —

జోహానా గొబ్బిని గురించి 'గాతే' అనేమహాకవి కూడా కవిత కట్టాడు.

గొబ్బి జర్మనీ దేశంలో సముద్రపుటొడ్డున ఒకచిన్న గ్రామంలో పుట్టింది. ఆగ్రామం మునిగిపోకుండా సముద్రాన్ని అడ్డుకునేట్టు "డైకు" అని ఒకరాతి కట్టడం ఉంది. ఆరాతికట్టడం పగుళ్లు విచ్చి నీళ్లు మెల్లి మెల్లిగా ఆగ్రామం మీదికి వచ్చాయి.

గ్రామంలో ఇళ్లు మునిగేట్టు నీళ్లు ఎక్కువౌతున్నాయి. గ్రామస్థుల గుండెలు గుబుకు గుబుకుమంటున్నాయి.

గొబ్బి కప్పుడు పదిహేడేండ్లయీడు. గ్రామానికి దూరంగా చిన్న చిన్నకొండలున్నాయి. మెల్లిగా - ఆకొండల మీదకు చేరితే ఉప్పెన అణగిపోయింతర్వాత బ్రతకవచ్చు. ప్రతినిముషము నీళ్లు విజృంభిస్తున్నాయి. జనం ఇండ్లకప్పుల మీదికిగూడా చేరుతున్నారు.

పొడుగ్గా కిన్నెరకన్నెల్లేఉంటుంది గొబ్బి. గొబ్బితల్లి చాలా పొట్టిది. నీళ్లల్లో మునుగుతుంది. ఆమెను బుజాలమీద కెక్కించుకుని ఎదురు రొమ్ముల మీదికి కుమ్ముతున్న నీటినిదాటుకుంటూ కొండకై ప్రయాణం కట్టింది. తల్లికి ధైర్యం చెప్పింది.

ఇరుగు పొరుగు వారు చూచారు. అందాకా వాళ్లకి ఏ ఆలోచన తట్టలేదు. గొబ్బి పోతుంటే తమ గతి యేమిటని గాభరా పడ్డారు.

"మాతల్లిని ముందు ఆకొండ మీద వదిలొస్తాను. ఆవిడ ముసలిది. ఈలోపల మీరా ఎత్తైన స్థలాల్లో నిలబడి

రచన:
శిష్ట్లా ఉమామహేశ్వరరావ్

ఉండండి. ఇదిగో! పాపం ఆమేక పిల్లను గూడాతీసుకుపోండి. దాన్ని నేను పెంచుతున్నా. నేనిప్పుడే వస్తా. ఘుడవవాకండి!" అన్నది గొబ్బి.

కొండమీద తల్లిని దించగానే బయలుదేరింది వెనక్కు. నీళ్లు పొంగి పోతున్నాయి. అయినా భయ పడలేదు. తల్లిమాత్రం "బిడ్డా బిడ్డా ఉప్పెన ఉప్పొంగి పోతున్నది. దారిలేదు తెన్ను లేదు. అంతా జలమయం. చెట్లు గూడా మునుగుతాయి. మళ్ళీ ఎందుకమ్మా వెళుతావు?" అన్నది.

"తల్లీ! మనవంటి వాళ్లేమన ఇరుగువాళ్లు. వాళ్లకిద్దరు బిడ్డలు గూడా. పోయిసాయం చేస్తాస్తా!" అన్నది గొబ్బి.

విసురుతూ వస్తోంది గాలి. వెనక్కు తోస్తోంది. ఫెళఫెళ లాడ్డుతున్నది నీరు. ఆనీటిని తోసుకుంటూ ఆగాలి నెదురిస్తూ పోయిందిగొబ్బి. తానే ఎత్తైన స్థలం మీదను వచ్చేదాకా ఇరుగువాళ్లనుండ మన్నాదో ఆస్థలం చేరుకుంది. చేరిందోలేదో "డైకు" పూర్తిగా పగిలింది. ప్రళయమల్లే ఎక్కడ చూచినా జలమే. ఎక్కడ చూచినా సుడులే! మధ్య మధ్య ఎత్తైన అలలు నడుస్తున్నగోడ లల్లే ఆ అలలు ఎదురొక్కన్న వాటినన్నిటినీ ఊడ్చేస్తున్నాయి. గొబ్బిన్నీ ఇరుగువాళ్లొనుంచున్న స్థలంగూడా మునిగింది. గొబ్బికి గొంతు వరకు వచ్చాయినీళ్లు. ఇరుగువారిలో తల్లీ తండ్రీ కొట్టుకుపోయారు. పెద్దపిల్ల మేకను పట్టుకు వద వద లాడింది. ఉప్పెనకు జాలి ఏమిటి. ఆబిడ్డా ఆ మేకా కూడా కొట్టుకు పోయారు.

పసిబిడ్డను గొంతు మీద కూర్చో పెట్టుకుంది గొబ్బి. "పాపం బిడ్డ ఎంత సంతోషంగా ఉన్నది? ఈబిడ్డకేమీ తెలియదు గదా! ఈ ఉప్పెనేమిటో, ఈ మరణ మేమిటో! ఈబిడ్డనేనా రక్షించాలి. గ్రామస్థులు ఎంత మంది తప్పించుకున్నారో! అస




లెవ్వరైనా బ్రతికారో లేదో! ఈ బిడ్డైనా మిగిల్తే బాగుండును.” అనుకుంది.

ఆనీటి వరద గొబ్బి గొంతిని కూడా ముంచాయి. రెండు చేతులూ బారచాచి పైకెత్తి పైన రెండరచేతుల్లోనూ పసిబిడ్డను పట్టుకుంది. కాళ్లు కదపలేదు. ఒళ్లు మెదపలేదు. ఉప్పెనను మించింది. అలలను మించింది. సముద్రాన్ని మించింది. అన్నిటినీ మించింది. ఎదుర్కొని అట్లాగే నుంచుంది. ఎంత ధైర్యం! ఎంతసాహసం.

ఆమెలో నూతనశక్తి ఏదైనా ప్రవేశించిందో యేమో! గుటకలు వేస్తున్నా కదలలేదు. జీవం ఉందో లేదో! ఇంతకీ పసిబిడ్డ అదృష్టవంతురాలు.

నావ వేసుకుని నలుగురు ఏవరో ఉపకార బుద్ధితో జనసాయం కొరకటూ ఇటూ తిరుగుతున్నారు. వాళ్లకు సముద్రం ప్రసవించిందా అన్నట్లుగా అలలపైన కిలకిలలాడుతూ ఆపసి బిడ్డ కానొచ్చింది. వెంటనే దగ్గరకు పోయారు. ఆ బిడ్డను రెండరచేతులు మోస్తున్నాయి. వాళ్లు గ్రహించారు. ఆబిడ్డనూ ఆగొబ్బినీ నావలో కెక్కించారు. గొబ్బికి ప్రాణం లేదు. ప్రాణం లేకుండా కూడాబిడ్డనరచేతుల్లో మోస్తూ ఎంతసేపు నుంచుందో! ఏశక్తివల్ల నుంచుదో, ఆశ్చర్యపోయారు నావలో నలుగురూ నావనడిపించుకుంటూ భద్రమైన స్థలాన్ని చేరారు. పొరుగూరులో కరుణ గలిగిన ఒకగృహస్థు ఆబిడ్డను పెంచాడు

ఆపసిబిడ్డ పెరిగి పెద్దదైన తర్వాత తన ఇంటిపేరు జొహానా అని పెట్టుకుంది. పేరూ తీరూ లేకుండా కొట్టుకుపోయిన తన ఊరు దగ్గర గొబ్బికి సమాధి కట్టించింది. ఏటేటా ఆసమాధి మీద పూలు పెట్టడానికి పోయి అక్కడకాసేపు ప్రార్థన చేసేది చిన్న జోహానా!



# బాలా! నీకు తెలియునా?

- ఇండియాలో బాడ్‌మింటన్ ఆట మొదట పూనాలో ఆడారు. తరువాత ఆ ఆట ఇండియాలో అంతటా తెలిసింది.
- ఇండియాలో మొట్టమొదట 1931 సంవత్సరంలో టాకీ (మాట్లాడే సినిమా) తీశారు.
- ప్రపంచంలో బాలభటులు 5,000,000 కు పైగా వున్నారు.

సంపాదన: బి. వి. వి. ఆర్. సుబ్బారావు.

- ఆస్ట్రేలియాలో ఒకాయన రెక్కలు కట్టుకొని పక్షి లాగ ఎగురుచున్నాడని—
- అమెరికా శాస్త్రజ్ఞులు మబ్బులు లేకుండానే వర్షం కురిపిస్తున్నారని—
- ఫ్రాన్సుదేశంలో ఒకామె ఒక గుహలో లక్షావేల సంవత్సరముల నాటి మనిషియొక్క ఎముకలను చూచిందని—
- అమెరికాదేశస్థులు పైలట్ (అంటే నడిపేవాడు) లేకుండానే విమానం నడిపించడం కనిపెట్టారని—
- పద్ధెనిమిది సంవత్సరాలు పక్షవాతరోగిని ఇంగ్లాడులో ఒక స్త్రీ పియానో వాయించి ఆ సంగీతంతో ఆజబ్బును పోగొట్టిందని—

సంపాదన: చల్లా సత్యనారాయణశర్మ (భీమలాపురం)

# రీటా తల వెండ్రుకలను పెంచును



రీటా కుదుళ్ళకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెండ్రుకలను పెంచుటకు అద్భుత మైన హెయిర్ టానిక్. తల వెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు, ఇంకను తలవెండ్రుకలకు సంబంధించిన సమస్తవ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేనకువేలు వాడి గుణమును పొందియున్నారు. మీరుకూడ నేటినుండి **రీటాయే** వాడుడు.

రీటా హిందూదేశ మంతటా దొరకును. సీసా 15 అ.




# RITA
## HAIR TONIC

---

## మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడుగారి

# బాలసంజీవిని

## యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

## డా॥ పిల్లా పాపయ్యా పాత్రుడు & బ్రదరు,

11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

| కుంభకోణం బ్రాంచి: | తిరుచినాపల్లి బ్రాంచి: |
|---|---|
| నెం. 7, సారంగపాణి కోవిల్ తూర్పువీధి. | నెం. 15, పుగళైపిళ్ళై వీధి, తెప్పకొలం |

# లెక్కల పద్యము

బాలా!


ఈ పద్యం జాగ్రత్తగా చదువు.
ఈ పద్యంలో ఒక ప్రశ్నవుంది.
ఆ ప్రశ్న అర్థంచేసుకొని దాని జవాబు
చెప్పుకో చూద్దాం!

పద్యం

ఖర్జూరఫలములు గణికుండు కొని తెచ్చె
సగముపాలు మోహాంబుసతికి ఇచ్చె
అందు నాల్గవపాలు ననుగు తమ్మునికిచ్చె
అష్టభాగంబిచ్చె నతని సతికి
తగ తొమ్మిదోపాలు తనయునికిచ్చెను
తనచేత నాల్గున్న తల్లికిచ్చె.
మొదట తెచ్చినవెన్ని?
మోహాంబు సతికెన్ని?
భ్రాత కెన్ని? వానిభార్యకెన్ని?
తనయుని కెన్నిచ్చె? తడయక తల్లికి
నాలుగెట్టులాయె? నయముతోడ
గణితమెరిగినట్టి బాలల పిలిపించి
అడుగవలయు దేవ అవసరముగ ॥

సంపాదన: బొండా అయ్యన్న (కాకినాడ)

(జవాబు ఈ సంచికలోనే)






## మళ్లీ ఎందుకు?

మేష్టారు:—గోపూ! ఒక్క పొలాన్ని 15 మందికలిసి 5 గంటలలో దున్నిరి. అదే పొలమును 20 మంది ఎంతకాలములో దున్న గలరు?

గోపు:—ఒకసారి దున్నినపొలాన్ని మళ్లీ ఎందుకండీ దున్నడం! ఈలెక్క అనవసరమండి!

రచన: వి. రామకృష్ణశర్మ (నందికొట్కూరు.)

## తూకం

తండ్రి:—ఏంరా! అబ్బాయీ! సంతలో వంకాయలు ఎలా ఇచ్చారు?

కొడుకు:—తూచి ఇచ్చారు నాన్నా!

సంపాదన: వేదనూరి సూర్యనారాయణ మూర్తి (నిడుదవోలు)

## దానం

కొడుకు:—అమ్మా! ఒకఅణావుంటే ఇయ్యి. పాపం ఆ ముసలి వానికి ఇస్తాను.

తల్లి:—ఎవడురా, పాపం, ఆ ముసలి వాడు?

కొడుకు:—మిఠాయిఅమ్మే ముసలి వాడే!

వి. రామస్వామి (మదనపల్లి)

## ఎడ్రసు

సోము:—(పోస్టాఫీసుకు వెళ్లి) ఏమండీ సార్! నాకేమయినా వుత్తరం వచ్చిందా?

పోస్టుమాస్టరు:— ఎడ్రసు?

సోము:—ఎడ్రసు కార్డు మీదే వుంటుంది చూడండి.

కె. సుబ్బరాయుడు (గార్లదిన్నె)

## దొరకడం

జాగ్రఫీ మేష్టారు:—ఏమిరా! బంగారం ఎక్కడ దొరుకుతుంది?

కుర్రాడు:—ఏమోనండిసార్! ఇంతవరకూ నాకెక్కడా దొరకలేదు

ఆర్. కొండల్ రావ్, (చికాకోల్)

## కూచోడం

టీచర్:—సెలక్షను పరీక్షలో మార్కులు తక్కువవస్తే, పెద్దపరీక్షకు కూర్చోనియ్యరు.

విద్యార్థి:—పోనీండిసార్. కూర్చోనియ్యకపోతే నిలుచోని వ్రాస్తాను కావలిస్తే.ఎలాగేనా కట్టిద్దురూ!

మాలెం హరకుమార్ (ఏలూరు)

## ఆలస్యం

తల్లి:—ఏంరాసోమూ! ఇంకా బడికి వెళ్లలేదు! 11 గంటలయింది! త్వొందరగా వెళ్లు!

సోము:—అమ్మా! ఆ గడియారం ముల్లు వెనక్కి 10 గం॥మీాదకు తిప్పవే! ఆలస్యంగా వెళ్తే మా అయ్యవారు కొడతారు!

## బరువు

మోహన్:—(పోస్టాఫీసుకు వెళ్లి) ఏమండీ! ఈ బంగీ రిజిస్టరు పార్సిలుచేయండీ.

పోస్టుగుమస్తా:—ఇది చాలా బరువుగావుంది. ఇంకా రెండుఅణాల బిళ్లలు ఎక్కువ అంటించాలి.

మోహన్:—సరి! సరి! ఇప్పటికే చాలాబరువని చెప్పారు—ఇంకా రెండు అణాల బిళ్లలుఅంటిస్తే ఇంకాబరువు కాదటండీ?

చావలి గోపాలకృష్ణమూర్తి(కూచనపూడి)

## హిస్టరీ

మేష్టరు:—ఒరేయ్ రెడ్డీ! పల్నాటి యుద్ధం ఎప్పుడుజరిగిందిరా?

రెడ్డి:—మొన్న సినీమాలోనండి.

టెమ్. వెంకటాచెలం(విజయనగరం)

## పౌరుషం

రాము:—కుక్కకు భయపడి పరుగెత్తి వచ్చావా?

సోము:—అబ్బే! లేదు ఆ కుక్క నాతోసమానంగా పరిగెత్తగలదేమో చూద్దామని!

ఎన్.వి.కె. మధుసూధన్ (గుడివాడ)

## మూలపదార్థాలు

(సైన్సు క్లాసులో)

టీచరు:—ఏమిరా గోపూ! మూల పదార్థాలు ఏమిటిరా?

గోపు:-మూలపదార్థాలా అండీ? చీపురుకట్ట, చేతికర్ర, రోలూ, రోకలీ, చెప్పులూ, చింకిగొడుగూ మొదలగునవి అండీ!

చల్లా వీరాస్వామి (విజయనగరం)

## ప్రసాదం మీద

ఒకరు:-ఏమిరా గోపూ! రోజూ గుడికి వెళ్తున్నావే! భక్తి ఎక్కువయిందేమిటి!

గోపు:- లేదురా! ఆ గుడిలో ఈ నెలంతా ప్రసాదాలు పంచిపెడుతున్నారు!

శ్రీపాద సుబ్రహ్మణ్యం (విజయనగరం)

## పొయ్యిమంట

తల్లి:- అమ్మాయీ! పొయ్యి మండుతుందో లేదో చూడు.

కూతురు:-అమ్మా! ఎంత ఊదినా కర్రలే మండుతున్నాయి గాని పొయ్యి మండలేదే!

మురుపల్లి లక్ష్మణస్వామి పట్నాయిక్ (సాలూరు)

## ఎవరు మొద్దు?

మేస్టారు:—(చాలా కోపంతో పేము బెత్తం పట్టుకొని).... ఈ బెత్తంచివరనో మొద్దువెధవ వున్నాడు!

ఒకరు:—ఏ చివరనండీ?

వెలిదండ కేశవరావు (రాజమండ్రి)

## రబ్బరు తుపాకీ!

ఇంట్లో దొంగపడ్డాడు. సామాన్లు మూటకట్టాడు. దొంగ బయలుదేరి వెళ్లిపోతూంటే:

"చేతులెత్తు!" అని ఇంటి యజమాని అన్నాడు! దొంగ వెనక్కి చూచేసరికి ఇంటాయన చేతిలో ఒకతుపాకీ దొంగవైపున గురిపెట్టివుంది! దొంగ గజగజవణకుతూ చేతులెత్తబోతూవుండగా:

"నా లబ్బరు తుపాకీతోటి ఏంచేత్తున్నావ్ నాన్నా!" అంది, ఆఇంటాయనకూతురు, బాల!

ఎన్. మురళీధర్ (మద్రాసు)

## ఎన్నేళ్లు?

ఒకడు:—నీకెన్నేళ్లురా కిష్టయ్యా?

కిష్టయ్యా:—నాకు రెండేళ్లు.

ఒకడు:—ఘోర్త ఘారం చదువుతూ నీకు రెండేళ్లేనా?

శెట్టయ్య:—అవును. నిజంగా రెండేళ్లే!

బాలా! ఎలాగో చెప్పకో?

ఎస్. వి. కె. మధుసూధనరావు

## క్రియ

ఉపాధ్యాయుడు:—(వ్యాకరణం చెబుతూ) క్రియ, వాక్యములో ఒకపనిని తెలియజేయును. మనిషికి తల ఎంతముఖ్యమో, వాక్యమునకు క్రియ అంత అవుసరము. తలలేని మనిషి ఎలాగుండడో, క్రియలేని వాక్యం అలాఉండదు. అయితే ఒక్కొక్కప్పుడు వాక్యములో క్రియలోపిస్తుంది. ఉదాహరణ: "సింహము మృగరాజు". ఈ వాక్యములో 'అయివున్నది'. అను క్రియ లోపించింది.

బాలుడు:—మాష్టరుగారూ! నాకొక చిన్నసందేహం. వాక్యములో క్రియ అప్పుడప్పుడు లోపిస్తుందన్నారుగదా, అయితే మనిషికి తలకూడా అప్పుడప్పుడు లోపిస్తుందండీ? ఉదాహరణ?

ఉపాధ్యాయుడు:—నీవే!

సంపాదన: కే. సూర్యనారాయణ (నిడదవోలు)

## బంధుత్వం


ఒకవూళ్లో పెళ్లిజరుగుతోంది. ఆ పెళ్లి కెంతోమంది వచ్చారు. ఒకడు ఇంకొకడ్ని పిలిచి, నువ్వు ఈపెళ్లివారికి ఏవిధంగా చుట్టానివి అని అడిగాడు.

వాడిలాచెప్పాడు:—"ఈ పెళ్లికొడుకు మామగారి, చెల్లెలు, కోడలి, పెదతండ్రికూతురు బావగారి మేనమామ కొడుకు అత్తగారి చెల్లెలికూతురు, నాయనమ్మ అల్లుడికొడుక్కి, పినతండ్రికొడుకు నవుతానండీ"— అని అన్నాడు. అబ్బ? చాలా దగ్గిర చుట్టమే.

రచన: రాయపూడి వరలక్ష్మి.




# బాల కాశీమజిలీలు




రచన : కొండపల్లి వెంకటరామదాస్, తుని.

## 10-వ మజిలీ

### "కోతుల విందు కథ"

బాలా! క్రిందటి నెలలో మన తాతయ్య బాలయ్య పండగ సందడిలో ప్రయాణం కాస్త ఆపేరు. ఆతరువాత తిరిగి ప్రయాణం సాగించి, అలా వెళ్తూవుండగా తోవలో ఒక పెద్దతోట కనబడింది. ఆ తోటలో చెట్లు బారులు బారులుగావుండి, ఒక్కొక్క చెట్టు కింద ఒక్కొక్క రాతిబండ పడివుంది. ఇదిచూచి మన బాలయ్య ఈ సంగతేమిటని తాతయ్య నడిగేడు.

తాతయ్య మొదలెట్టాడు. "బాలయ్యా! ఇది ఈనాటి ముచ్చటకాదు. త్రేతాయుగం నాటిది. రామాయణకాలం లోనిది. శ్రీరాములవారు సీతను చెరవిడిపించి తిరిగి అయోధ్యకు వచ్చేస్తున్న సమయంలో జరిగిన సంగతి.

విను, చెప్తాను. రాములవారూ లక్ష్మణస్వామి, సీత, జాంబవంతుడు, హనుమంతుడు అందరూ వస్తూవుండగా ఈ తోటచేరగానే రాములవారికి ఒక బుద్ధి పుట్టింది. ఏమిటంటే - లంకలో యుద్ధంలో తనకు సహాయంచేసిన హనుమంతుడు, సుగ్రీవుడు మొదలైన కోతులన్నిటికీ ఒక గొప్పవిందు చేద్దామని. అనుకోవడమేమిటి, వెంటనే ఆ తోటలోనే విందుకి అన్ని ఏర్పాట్లూ జరిగాయి.

సరే, ఈవార్త ఎలాగో కోతులకు అందింది. ఎక్కడలేని కోతులూ తలొక రాతిబండ దొర్లించి తెచ్చుకొని, ఒక్కొక్క చెట్టుకిందా, హనుమంతుడుగారి ఆజ్ఞప్రకారం తయారుగా కూర్చున్నాయి. వంటలు పూర్తికాగానే ఆకులు వేయడం ఆరంభించారు.

విస్తళ్లలో కూరలు, పచ్చళ్లూ, రకరకాల పిండివంటలూ అలా వడ్డించేస్తున్నారు. ముసిలి కోతులు, పిల్లకోతులు ఎంత వేగిరం తిందామా అని ఉబలాట పడుతుంటే అంత తాపీగా వడ్డనలు జరుగుతున్నాయి. వడ్డన పూర్తి అవుతేనేగాని ఎవ్వరూ ఏమీ తినరాదని హనుమంతుడుగారి హుకుం!

విస్తళ్లలోవున్న పచ్చళ్లూ అవీ ఘుమఘుమలాడుతున్నాయి. కోతులనోళ్లు ఊరుతున్నాయి. అయినా హనుమంతుడిగారి ఆజ్ఞప్రకారం అలాఅన్నీ కూర్చున్నాయి. ఆఖరు పంక్తిలో ఆఖరున కూర్చున్న ఓచిన్నకోతికి మాత్రం ఆకలి ఎంతకీ ఆగలేదు. ఇటూఅటూ చూచింది. పైకి చూచింది. అక్కడే పైన చెట్టుకొమ్మకి ఒక చిన్న మామిడిపిందె కనబడింది. చుట్టుప్రక్క లొకసారి చూచి, ఊపిరిబిగించి చెంగున మీదకుఎగిరి, ఆమామిడి పిందెను తెంపుకొని మళ్లా నేలకు గెంతింది. ఎప్పుడైతే ఈ కొంటెకోతి గెంతిందో, తక్షణందాని ప్రక్కనున్న ఇంకో కోతి ఏమిటో అనుకుని ఒకసారి గెంతేసింది. ఇలాగ, దాని ప్రక్కనున్న కోతి, అలా, అలా అన్ని కోతులు గెంతటం మొదలెట్టాయ్! ఈ విధంగా ఒకదాన్ని మించి ఒకటి గెంతటం మొదలెట్టాయ్! ఆకులలో వేసినవన్నీ దుమ్ముపాలవుతున్నాయ్! హనుమంతుడు మొదలైన వారెంత చెపుతూన్నా వినిపించుకోవటం లేదు.మహాకల్లోలంగా గెంతేస్తూన్నాయ్ ఈకోతులన్నీ!



ఈ కోలాహలం చూచి రాములవారికేమీ తోచలేదు. వెంటనే హనుమంతుడిని సంగతేమిటో కనుక్కోవలసిందిగా ఆజ్ఞాపించారు. అప్పుడు హనుమంతుడు తన శరీరంవున్నపాటునే ఆకాశం అంతచేసి ఒక్క పెద్ద అరపు అరచేసరికి, కోతుల కన్నింటికీ ఒంటి మీదకు స్పృహ వచ్చింది. పిల్లుల్లాఒదిగి కూర్చొన్నాయ్! అప్పుడు! హనుమంతుడిలా అన్నాడు: "ఏయ్! కోతులూ! ఈవాడు మీరు చేసిన పనివల్ల మనకోతి జాతికంతా తీరని కళంకం తెచ్చిపెట్టారు. ఇంతకీ, ఈ రసాభాసకంతకీ కారణం, మీలో ఎవరో, ముందుకు వచ్చి చెప్పితేనే చెప్పేరు. లేకపోతే చూచుకోండి మిమ్మల్ని అందర్నీ పంచేస్తానో!"

ఈ మాటలన్నీ వినంగానే కోతులన్ని గజగజలాడినై. చివరకి తప్పుచేసినకోతి అనుకుంది గదా! అబ్బే! నా వలన వీళ్లంతా, నాతోపాటు శిక్షపడటం ఏమీ బాగాలేదు. నేనే వప్పేసుకుంటాను. అని తనలోతను నచ్చచెప్పుకొని ముందరకువచ్చి తల వంచి, శ్రీరామచంద్రునకు నమస్కారంచేసి ఇలాచెప్పింది.

"ఓ రామచంద్రా! ఎంతకీ వడ్డన పూర్తవక పోవటంవలన నా కాకలివేసింది. ఆకలికాగలేక మీదకు చూచేటప్పటికి, నేను మామిడిచెట్టు క్రింద కూర్చొన్నాను కనుక నా అదృష్టంవల్ల నాకో మామిడికాయ కన్పించింది. వెంటనే ఆకలి ఆపుకోలేక, ఒక్క దూటులో ఎగిరి ఆకాయ త్రెంపుకున్నాను. నేనెగరటంచూచి నా ప్రక్కనున్న కోతి ఏమిటోసంగతి తెలియకుండా ఎగిరింది. ఈ విధంగా కోతులన్నీ ఎగిరినై. ఈ చిందరవందరకంతకూ నేనే కారణము. అందువల్ల మీకుతోచిన శిక్ష వేయండి."

ఆ కోతిఅన్నమాటలకు రామచంద్రుని గుండెకు జాలివేసింది. మళ్లా మరుక్షణంలో ఇంకో పెద్ద విందుపర్పాటు చేయించి, దాంట్లో ముందర, ఇందాకల అల్లరిచేసిన కోతికి, వడ్డింపించి, ఆ కోతులన్నింటికీ బలేబలే విందుచేయించారు. ఇదీ! బాలమ్మోయ్, ఈరాతిబండలు, ఆనాడు కోతులు విందుకోసం తెచ్చుకొని వేసుకున్న


పీటలు. ఇహా తెల్సిందా! అంటే బాలయ్యా! కడుపుచెక్కలయ్యేలా నవ్వుతుంటో, తాతయ్యా! బలే సరదాౖయెనకథ చెప్పేవ్! ఇక నాకూ సత్తువొచ్చింది పద. ముందట మజిలీ చేరుకుందాం అంటూ మూట నెత్తినేసుకుని ముందుకు పోసాగేడు బాలయ్య. మళ్లా మజిలీలో ఊసులాడుకుందాం! ఏం!! ......!

# పాపం! ఆ అబ్బాయి దారి తప్పి పోయాడు!

బాలా!

ఈ దిగువ బొమ్మలో ఇద్దరు అబ్బాయిలు వున్నారు. ఒకడు గుడిసెదగ్గర అప్పచ్చులు తయారు చేస్తున్నాడు. ఇంకోడు ఆకులు తేవడానికి వెళ్లాడు.

ఆ అడవికి వెళ్లిన అబ్బాయి, దారితప్పిపోయినాడు!



పాపం! ఆ అబ్బాయికి నీవు దారి చూపాల. అడ్డురాకుండా వేగంగా దారి చూపాలి. లేకపోతే అప్పచ్చి చల్లారి పోతుంది! ఊఁ....తీసుకెళ్లు.

# చెల్లికి బహుమానం

రచన: వి. రామస్వామి (మదనపల్లి)

నేను సెలవుల్లో మావూరు (కడప)కి వెళ్లాలని సామానులన్నీ కట్టిపెట్టి, బజారుకి వెళ్లాను. మా చెల్లాయికి రోజా పువ్వులంటే ఎంతో ఇష్టం. సరే, ఎనిమిది అణాలిచ్చి మంచి రోజాపూలు కొని తడిగుడ్డకి చుట్టాను.


మర్నాడు పొద్దున్న రైలు ఎక్కాను. కడపకి పోవాలంటే, రేణిగుంట స్టేషనులో దిగి, తిరిగి వేరేరైలు ఎక్కాలి. ఆ రైలు కూడా ఎక్కాను. నందలూరు, రాజంపేట స్టేషన్లువచ్చాయి. తరువాత స్టేషను కడప.

సరిగ్గా 12-30 గ॥కు రైలు కడప చేరింది. ఒక కూలివాడినిపిలిచి, సామానులుదించి, ప్లాటుఫారం మీద నడుస్తుండగా నాకళ్లు నేను నమ్మలేకపోయాను! ఆరైలులో నించే మానాన్న, అమ్మా, చెల్లాయి-ముగ్గురూ దిగారు. నేను తెల్లబోయి చూస్తున్నా. ఇంతలో మానాన్న నాదగ్గరికివచ్చి, "రామం! మేము నిన్న తిరుపతికి పోయి వుంటిమి. సుమిత్రకు (చెల్లాయికి) వెంట్రుకలు తీయుటకు ముడుపు కట్టియుంటిమి కదూ! నీకు జాబు కూడా వ్రాసి యుంటిమి. జాబు అందలేదూ?"- అని అన్నారు.




చెల్లాయి తల చూచేసరికి, నా చేతిలోని రోజా పూలకట్ట నాకు తెలియకుండ నే కింద పడింది!!!

# చిత్రమైన చిత్రకారుడు



బాలా!

ఈ బొమ్మలు చూచావా? కొబ్బరిచెట్టు, ఆ చెట్టు పక్కనే ఒక పిల్లివున్నాయి. ఈ బొమ్మలు వేయడంలో మనచిత్రకారుడు పప్పులోకాలువేశాడు. ఎక్కడెక్కడ తప్పులున్నాయో చెప్పగలవా?

(జవాబు ఈ సంచికలోనే వుంది.)


# బిటాలాక్స్

చాక్‌లెట్ భేదిబిళ్లలు

సుఖవిరేచ నౌషధము




ఇవి చాక్‌లెట్ భేదిబిళ్లలు. సుఖవిరేచనము కలిగించి మలబద్ధమును పోగొట్టి మంచి జీర్ణశక్తి నిచ్చును.

పొట్లం 2 బిళ్లలు 1 అణా.


అన్ని చోట్ల దొరకును.

Stockists : M/s DADHA & Co., P. T. MADRAS.

తయారుచేయువారు:

**BOMBAY TABLET MANUFACTURING CO.**

Post Box No 2092, BOMBAY. 2.




## మధుర

మన దేశంలో 'మధుర' అనే పేరుగల పట్టణాలు రెండున్నాయి. ఒకటి ఉత్తర హిందూదేశంలో యమునానదీ తీరానుంది. మరొకటి దక్షిణ హిందూదేశంలో వైగైనది తీరానుంది. మన మిప్పుడు తెలుసుకోవలసింది రెండవ మధురను గురించే!

ఈ వైగైనది ప్రవహించే ప్రదేశమంతా పూర్వకాలంలో బ్రహ్మాండమైన అరణ్యంగా వుండేది. ఒకనాడు ధనంజయుడనే కోమటి తనవస్తువులను అమ్ముకొని మిగిలినవాటితో ఆ అరణ్యం గుండా గబగబ యింటికి వెళ్లుతున్నాడు. ఆ అడవిలో కొంత దూరం వచ్చేసరికి అతడికొక పెద్ద చెరువు కనిపించింది. ఆ చెరువులో హాయిగా స్నానంచేసి దాహం తీర్చుకున్నాడు. అప్పటికి బాగా చీకటిపడ్డది. ఆ చీకట్లో పోలేక ఆరాత్రికి అక్కడే పడుకుందామని చెరువు గట్టుమీది కొచ్చాడు. అక్కడొక పొదలో అతడికొక శివలింగము కనిపించింది. ఆ శివలింగానికి నమస్కారంచేసి ప్రార్థించి, మరునాడు వూరికివెళ్లి రాజుగారితో జరిగిన సంగతంతా పూసగుచ్చినట్లు చెప్పాడుధనంజయుడు. ఆరాజు పేరు కులశేఖర పాండ్యుడు. అతడు చాలా ఆశ్చర్యపడి వెంటనే తన మంత్రులను వెంటబెట్టుకొనివెళ్లి ఆశివలింగాన్ని చూచి, అక్కడొక గొప్పదేవాలయాన్ని గొప్పనగరాన్ని కట్టించాలనుకున్నాడు. వెనువెంటనే చుట్టుపక్కలుండే అడవిని నరికి శుభ్రంచేసి పెద్దగుడిని, పెద్దపెద్ద వీధులు, భవనాలు, మేడమిద్దెలు, పూలతోటలు, వూరిచుట్టు కోటకట్టిం

చాడు. కొద్దిరోజుల్లోనే అక్కడ మంచి నగరం తయారైంది. చాలా అందమైనది తనకిష్టమైనది కాబట్టి కులశేఖర పాండ్యుడు దానికి "మధుర" అనే పేరు పెట్టాడు. "మధుర" అంటే మధురమైనది లేక తియ్యనిది అని అర్థం. అప్పటినుంచి కులశేఖర పాండ్యుడు మధురా నగరంలోనే నివసించాడు.

ఇట్లా వుంటూండగా ఒకనాడు పార్వతీదేవి ఏదోతప్పు చేసింది. అప్పుడు శివుడికి కోపమొచ్చి ఆమెను పాండ్యరాజుల వంశంలో స్త్రీగా జన్మించమని శపించాడు. ఈ కథ జరిగినప్పుడు కులశేఖర పాండ్యరాజు కుమారుడు మలయధ్వజుడనేరాజు మధురలో రాజ్యం చేస్తున్నాడు. ఆయనకెవ్వరు కొడుకుల్లేరు. అందుకోసం దశరథ మహారాజులాగా పుత్రకామేష్టి యాగం చేస్తున్నాడు. ఆ సమయంలో మంటలోనుంచి, ఒక చిన్నపిల్ల పుట్టింది. పార్వతే చిన్న పిల్లగా పుట్టింది. ఆ పిల్ల చక్కని చుక్కలాగుంది. ఆరాజు, ఆయన రాణి కాంచనమాల చాలా సంతోషపడి ఆపిల్లను అల్లారు ముద్దుగా పెంచారు. ఆ అమ్మాయికి 'మీనాక్షి' అని మంచి పేరు పెట్టుకున్నారు.

చిన్నతనంనుంచి మీనాక్షి బాణాలతో, కత్తులతో యుద్ధం చెయ్యటం బాగా నేర్చుకుంది. ఆమెకు పెండ్లీడు రాగానే మలయధ్వజుడామెనొక గొప్పరాజుకిచ్చి పెండ్లి చెయ్యాలనుకున్నాడు. అప్పుడు మీనాక్షి ఏంచెప్పిందో తెలుసా! "నాతో యుద్ధంచేసి ఎవరైతే గెలుస్తారో వాళ్లనే పెండ్లిచేసుకుంటాగాని, యింకెవ్వరిని చేసుకోను" అని చెప్పింది. రాజులందరు యీమాట విన్నారు. "ఓహో! ఆడపిల్లట, రాజులతో యుద్ధంచేస్తుందట! చాలా తమాషాగావుందే, ఆడపిల్లను ఓడించటం ఎంతసేపు." అనుకుంటూ మీనాక్షితో యుద్ధానికి దిగారు.

కాని మీనాక్షిని యుద్ధంలో ఓడించడానికి ఏవరిచేతగూడ కాకపోయింది. చివరకు సుందరేశ్వరుడనే వీరుడు మీనాక్షితో యుద్ధంచేసి ఆమెను ఓడించాడు. అప్పుడు మీనాక్షి సుందరేశ్వరులకు మధురానగరంలో పెండ్లిజరిగింది. వాళ్లిద్దరు మధురలో చాలాకాలం

రాజ్యంచేశారు. మ ధు ర లో సుందరేశ్వరుడు గారడీవాడిలాగే, ఎన్నెన్నో మాయ మంత్రాలు, కృష్ణుడిలాగా, లీలలు, చాలా చేశాడు. అవన్నిచూచి సుంద రేశ్వరుడెవరో దేముడేకాని, అం దరిలాగా మనుష్యుడు కా ద ను కొని ప్రజలందరు అతణ్ణి చాలా భక్తితో పూజించుతూ వుండే వారు. కొంతకాలానికి సుందర రేశ్వరుడు, మీనాక్షీ, వాళ్లకు శివుడు, పార్వతిగా కనిపించి మాయమైనారు. ప్రజలందరూ అదిచూచి సంతోషపడి మధుర లోని దేవాలయంలో మీనాక్షి దేవి విగ్రహాన్ని పెట్టి పూజిస్తూ వచ్చారు. ఆ నాటినుంచి దానికి మీనాక్షీ దేవాలయమనే పేరు కలిగింది. దేవాలయంలో చాలా గోపురాలు, మంటపాలు కట్టించారు. మధుర గొప్ప క్షేత్రమైంది.

ఈ క్షేత్రానికి చాలామంది యాత్రికులు రావటంచేత చాలా మందిరాజు లిక్కడేవుండి రాజ్యం చెయ్యడంవల్ల మధుర చాలా గొప్పనగరమైంది. ఊరికి మధ్యలో మీనాక్షీ దేవాలయముంది. ఈ దేవాలయంలో తొమ్మిది పెద్దపెద్ద గోపురాలున్నాయి. చుట్టూ పెద్ద గోడకూడావుంది. గుడిలోపల కోనేరు, టెంకాయచెట్లు, పెద్ద మంటపాలు వున్నాయి. దక్షిణ వైపుగుడిలో మీనాక్షీ దేవి, ఉత్తరవైపుగుడిలో సుందరేశ్వరుడు వుంటారు. మీనాక్షీగుడిలో రంగు రంగుల చిలకలెన్నో వున్నాయి. ఈ గుడిలో వెయ్యి స్తంభాల మంటపం అని ఒక టుంది. ఇంచుమించు వెయ్యిస్తంభాలతో కట్టేరీ మంటపాన్ని. ప్రతి స్తంభం చక్కని రాతి బొమ్మ లుంటాయి. ఆ బొమ్మలన్ని ఎలా చేశారనుకున్నావ్! పెద్ద బండను తీసుకొని, దాన్ని చెక్కి బండను కాస్తా మంచిబొమ్మను చేశారు. మీ రెవరైనా అలాగే రాతి బొమ్మలను తయారు చెయ్య గలరా! మీనాక్షీ గుడిలో యిలాంటి బొమ్మలు లక్షలు కోట్లుగా వుంటాయి. కాని ఆ బొమ్మలు ఎంత చక్కగా వుంటా యనుకున్నారు! నిజంగా వాటిని చూచి తీరాల్సిందే. అంతమంచి బొమ్మలు, అంత పెద్దగుడి, దక్షిణ హిందూదేశంలో ఎక్కడా లేవు!

ప్రతిసంవత్సరం చైత్ర వైశాఖ

మాసాలలో మీనాక్షీ సుందరేశ్వ లకు పెండ్లి జరుగుతుంది. వరుసగా పదిరోజులు మధురలో వుత్సవాలు, తిరునాళ్లు (తీర్థం) జరుగుతాయి. అప్పుడు చాలామంది వెళ్తారు మధురకు. మధురలో ఒకచోట 'తెప్పకుళం' అనే పెద్ద కోనేరుంది. దానిమధ్య ఒకపూలతోట పెద్దచెట్లు, తోట మధ్య తెల్లని మండపం వున్నాయి. ఆ తోటలోకి వెళ్లాలంటే చిన్నపడవ మీద వెళ్లాలి. ఈ కోనేరులో తెప్పమీద మీనాక్షీ సుందరేశ్వరులకు ప్రతిసంవత్సరం వుత్సవం జరుగుతుంది. అప్పుడా కోనేటి చుట్టూ లక్షదీపాలు వెలిగిస్తారు. ఉత్సవం చాలాబాగుంటుంది.

ఒకప్పుడు మధురలో తిరుమల నాయకుడనేరాజు రాజ్యంచేశాడు. మీనాక్షిగుడిలో, మధురలో ఆయన చాలా భవనాలు, సత్రాలు కట్టించాడు; తనుతన రాణులు నివసించటానికి అతడొక పెద్దమేడను కట్టించుకున్నాడు. దానినే యిప్పుడు తిరుమలనాయకుని భవనము అనంటారు. దాంట్లో గమ్మత్తు ఒకటుంది. ఇండ్లు కట్టేటప్పుడు, అన్నిటితో



పాటు కొయ్యసామాను, ఇనుపసామాను వుపయోగిస్తారు. కాని తిరుమల నాయకుని భవనంలో, ఎంత వెదికినా చివరకు ఒక్కటైనా కొయ్యముక్కగాని ఇనుపమేకుగాని కన్పించదు. ఆ మేడ చాలా అంతస్థులుగలదే. మరి దాన్ని ఎలాకట్టారో!!! ఇప్పుడా మేడలో గవర్నమెంటువారి ఆఫీసులున్నాయి.

మధురలో, సరిగ చీరలు, పట్టుచీరలు, తలపాగాలు నేస్తారు. అవన్నీ చాలాఖరీదుకలవి. బొంబాయిలోలాగే మధురలోకూడ, బట్టలునేసే యంత్రాలున్నాయి. మధురలో మంచిమంచి బొమ్మలు, యిత్తడి చెంబులు, గిన్నెలు, లోటాలు చాలాతయారు చేస్తారు.

ఇప్పుడు మధుర చాలా పెద్ద పట్టణం. చెన్నరాజధానిలో మద్రాసు తర్వాత పెద్దపట్టణం యిదే! మరియింత మధురమైన మధురను చూడవద్దూ???

# నీ చేతికి ఎన్ని వేళ్లు?

బాలా !

నీచేతికి ఎన్ని వేళ్లువున్నాయని నిన్ను ప్రశ్న వేస్తే నువ్వు "అయిదు" అని వెంటనే జవాబుచెప్తావు. నాకు తెలుసును. కాని, అవి నాలుగువేళ్లే అని ఋజువు చేయగలను.



ఎలాగంటే—నీ చేతిలోని మధ్యవేలుని, బొమ్మలో X గురుతువున్నచోట సరిగా నీముక్కుమీద పెట్టుకొని చూడు. నీకు నాలుగువేళ్లే కనిపిస్తాయి. అయిదోవేలు మాయమయి పోతుంది......చూచావా? ఇంతాచేస్తే నీ చేతికి నాలుగువేళ్లే వున్నాయి!

సంపాదన: మామిడన్న శాంతకుమారి (బందరు)




జీవితమునకు క్రొత్తకాంతి!

పండిత డి. గోపాలాచార్యులవారి

జీవామృతము

ఈ ఆనందసంసారం ఒక ఆరోగ్యచిత్రం. జీవామృతము బలవర్ధకౌషధం. స్త్రీలూ, పురుషులూ సేవింపవచ్చును. ఇది జీవితమునకు క్రొత్త కాంతి నిచ్చును. దేహమునకు చురుకుదనమునిచ్చి దేదీప్యమైన ఆరోగ్యమును ప్రసాదించును.

ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్ మద్రాసు 17

# ఉండాలోయ్ ఉండాలి!

కవిత్వమునకు తిక్కన
కవిత్వమునకు తిమ్మన
ఉండాలోయ్ వుండాలి

రచన: తురుమెళ్ల వేణుగోపాలరావు
(తెనాలి)

వంటకు పొయ్యి
పప్పుకు నెయ్యి
తినుటకు చెయ్యి
ఉండాలోయ్ ఉండాలి

చెరువుకి గట్టు
శెట్టికి కొట్టు
ఇంటికి గుట్టు
ఉండాలోయ్ ఉండాలి

రచన: యం. కుసుమ కుమారీదేవి
(చోడవరం)

పూజకు పూలు
చదువుకి స్కూలు
హాస్యానికి ఫూలు
ఉండాలోయ్ ఉండాలి

రచన: షత్రి బ్రహ్మానందరావు
(బందరు)


---


"బాల" సం॥ చందా రూ 5

అర్థ సం॥ చందాలేదు.
వీ. పీ. పంపబడదు.

మేనేజరు "బాల"

మైలాపూరు మదరాసు 4


కొడుకు: నాన్నా! ఇక్కడివాళ్లకు పెద్దలంటే భక్తిలేదే!

తండ్రి: ఏందుకూ?

కొడుకు: ఏ కొట్టు బోర్డు చూచినా "అండ్ సన్సు" "అండ్ బ్రదర్సు" అనే వుందికాని "అండ్ ఫాదర్సు" అని లేదు!

—బి. రాధాకృష్ణరావు (ఖమ్మమ్మెట్టు)

---

## "బాపూజీ" పదం

రచన: "ప్రయాగ" బి. ఏ.
(రేడియో మెద్దబ్బాయి)

రామరామ జయసీతారాం
రామరామ జయరాజారాం
లేదులేదు మన బాపూజీ
లేదు లోకపిత బాపూజీ
దేశ ఐక్యతకు బాపూజీ
దేహము విడిచెను బాపూజీ
పిల్లలు పాపలు అయ్యయ్యో
బాలలు వృద్ధులు అయ్యయ్యో
తాత లేడనీ-తండ్రి లేడనీ
తల్లడిల్లిరీ-అయ్యయ్యో

[ఈవరుసని గాంధీతాత చరిత్ర పుస్తకరూపంతో వస్తోంది వెల బేడ.]

"బాల" ఏజంట్లను అడగండి.





రచన : ఉ. శ్రీనివాసరావు (మదరాసు)

అనగా అనగా ఒక రాజు వుండేవాడట. ఆ రాజు అమాంతంగా గొప్పవాడయి పోవాలనుకున్నాడు. ఒక్కసారి గొప్పవాడు ఎల్లాఅయిపోతాడు? అందుకని అదేపనిగా ఆలోచించాడు. ఏదో ఒక గొప్పపని యిదివరకు ఎవ్వరు చేయనిది చేద్దామనుకున్నాడు. ఆఖరికి ఒక వుపాయం తోచింది ఆ రాజుకి. తాతలు ముత్తాతలు కాలంనుంచి వస్తూన్న రాత్రిని, పగలుని మార్చివేద్దామనుకున్నాడు. అంటే పగలు, రాత్రి తారుమారు చేద్దామనుకున్నాడు. ఎల్లా చెయ్యగలడు? పగలువచ్చే సూర్యుడు పొమ్మంటేపోడు! రాత్రివేళ సూర్యుణ్ణి రమ్మంటేరాడు! అందుకని ఏం చేసాడనుకున్నారు! "పగలుచేసే పనులన్నిటిని రాత్రిపూటచేయమని పగలు తలుపులన్నిమూసి పడుకోమని ఆజ్ఞాపించాడు రాజు. "ఇదెక్కడిరాజు బాబు! పిచ్చిగాని ఎక్కిందా?" అని ప్రజలంతా ఆశ్చర్యపడ్డారు. "తలుపులన్ని మూసుకొని పగలయితే పడుకోగలం, కానిరాత్రిళ్లు చీకట్లో పనులు ఎల్లాగ చేసుకోడం" అని ప్రజలంతా భయపడ్డారు.

పూర్వకాలంలో ఆముదం దీపాలు, కాగడాలు రాత్రిళ్లు వెలిగించుకునేవారు. అవి అట్టే వెలుగును యిచ్చేవికావు. గుడ్డిదీపాల్లావుండేవి. అందుకని పగలే అన్ని పనులను చేసుకొని రాత్రిళ్లు పడుకునేవారు. రాత్రిళ్లు ప్రయాణాలు మానుకునేవారు. చీకటిగావుంటే వున్నవస్తువులు సరిగా కనిపించవు. పురుగుపుట్ర కనిపించదు. అప్పుడువుండే దీపాలు ఎక్కువ కాంతిని యివ్వలేక పోయేవి. దీపంచుట్టు కొంతమేర మాత్రం వెలుతురువుండేది. అందుచేత ఏవైనాపనులు చేద్దామనుకుంటే వీలుండేదికాదు. పైగా

గాలి వేసిందంటే దీపాలు ఆరిపోయేవి. మరి అల్లాంటప్పుడు పగలుచేసే పనులను రాత్రిళ్లు ఎల్లా చెయ్యడం? అందుకనే ప్రజలు రాజుని పిచ్చివాడన్నారు. రాత్రిళ్లు చీకట్లో ప్రజలు పనులను చేసుకోలేరు అన్న సంగతిరాజు ఆలోచించలేదు. పోనీ రాత్రిళ్లు కూడా బాగా వెలుతురునిచ్చే దీపాలుంటే అన్ని పనులు చేసుకోగలరు అన్నవిషయం రాజు తెలుసుకోలేక పోయాడు. బాగా వెలుతురునిచ్చే దీపాలు ఎల్లా తయారు చేయాలో కనుక్కోలేకపోయాడు ఆరాజు. ప్రజలు చాలా బాధలు పడ్డారు. తర్వాత ఆరాజు చచ్చిపోయాడు.

"అమ్మయ్య బ్రతికాం!" అని ప్రజలంతా అనుకున్నారు. అనేక సంవత్సరాలు గడిచాయి. రాను రాను రాత్రిళ్లుకూడా పనులను చేయవలసిన అవసరాలు వస్తూ వుండేవి. అప్పటినుంచి తెలివితేటలుగల మనుష్యులు వెలుతురు ఎక్కువ యిచ్చేదీపాలు కనుక్కోడం మొదలెట్టారు. కిరసనాయిలు దీపాలు, గాలివేస్తే ఆరిపోకుండా వుండే గాజుచిమ్నీ దీపాలు, (లాంతర్లు) కొవ్వువత్తి దీపాలు యింకా, అనేక రకాలైన దీపాలు ఆముదం దీపంకన్న ఎక్కువ వెలుగునిచ్చేవి కనుక్కోడం మొదలెట్టారు. ఇంకా వెలుగు ఎక్కువగా వుంటే ఎంతో



బాగుంటుంది, అని ప్రజలంతా అనుకునేవారు. "దీపంచుట్టూ చాలమేర వెలుతురువుంటే బాగుంటుంది" అని కొత్తకొత్త దీపాలకోసం ఆలోచించడం మొదలెట్టారు. తర్వాత గ్యాస్ దీపాలు, తర్వాత గ్యాస్‌లైట్లు, పెట్రోమాక్స్‌లైట్లు కనిపెట్టారు. ఇవి ఎంతో ఎక్కువ కాంతిని చాలా దూరంవరకు యిచ్చేవి. వీటివెలుతురు తెల్లగా వుంటుంది. రాత్రిళ్లు గూడ అనేకమైన పనులను, ప్రయాణాలను చేయడానికి సులువుగా వుండేది. కాని యీదీపాల గురించి బోలెడు డబ్బయిపోయేది. ఎక్కువ వెలుతురుకావాలి, డబ్బు ఖర్చు కాకూడదు. చవకలో ఎక్కువ వెలుతురు వచ్చేదీపాల కోసం తెలివితేటలుగలమనుష్యాలు ఆలోచించడం మొదలెట్టారు.

తర్వాత కొన్ని సంవత్సరాలకి ఎలక్ట్రిక్ దీపాలను కనుక్కొన్నారు. ఇప్పుడు పట్టణాలలో ఎలక్ట్రిక్ దీపాలని మనం చూస్తున్నాం. ఇవి ఎంతో కాంతిని యిస్తాయి. చాలా తెల్లని కాంతితో వెలుగుతాయి. వీటిల్లో కళ్లు మిరుమిట్లు గొలిపేటట్టు వెలిగే దీపాలు గూడా వున్నాయి. మిట్ట మధ్యాహ్నం సూర్యుడికేసి ఎలాచూడలేమో అలాగే కొన్ని ఎలక్ట్రిక్ దీపాలకేసి చూడలేము. అంటే అవి ఎంతో ఎక్కువ వెలుతురును యిస్తాయన్నమాట. ఎలక్ట్రిక్ దీపాలు వచ్చాక రాత్రిళ్లు చేయలేని పనులంటూ లేవు. పగలుచేసే పనులన్నిటిని చేసుకోవచ్చును. పెద్దపెద్ద మిల్లులు, ఆఫీసులు రాత్రిళ్లుగూడా పనిచేస్తూ వుంటాయి. రైళ్లు, కార్లు పరుగెత్తూనే వుంటాయి. ఇంక ఒకటేమిటి అన్ని పనులు చేసుకోవచ్చును. పట్టపగలువుండే అంత వెలుతురుకన్న ఎక్కువ వెలుతురునిచ్చే ఎలక్ట్రిక్ దీపాలుగూడావున్నాయి. అల్లాంటి దీపాలున్నచోట రాత్రి, పట్టపగలులావుంటుంది. యింకోసారి యీ దీపాలగురించి తెలుసుకుందాం.



# గ్రైప్ సిరప్




, గ్రైప్ సిరప్ చంటిపిల్లలకు, శిశువు లకు బాధలేని, హాయి అయిన విరేచన కారి. పిల్లల ఆరోగ్యాన్నిగురించి కాస్త అనుమానంతగిలితే, ఒక మోతాదు గ్రైప్ సిరప్ యివ్వండి.


ఐ. టి. యల్. ప్రాడక్టు

తయారు: మైసూరు ఇండస్ట్రియల్ అండ్ టెస్టింగ్ లేబొరేటరీ లిమిటెడ్, మల్లేశ్వరం. బెంగుళూరు. సెల్లింగ్ ఏజెంట్లు:
బెస్ట్ అండ్ కంపెని, లి. మద్రాసు.




## ఏడ్చు వారిని నవ్వించును



★



### ఆరుగురు బాలురు

ఆరుగురు బాలురలో
5, 6 సంఖ్యలుగల
బాలలు కవలపిల్లలు.

### లెక్కల పద్యము

గణికుడు 288 పండ్లు కొని తెచ్చాడు.

### చిత్రమైన చిత్రకారుడు

తప్పులు : పిల్లితోకకి కుచ్చువుండి. కొబ్బరి చెట్టుకి అరటిగెల వేసివుంది. కొబ్బరిచెట్టు ఎత్తుతో సరిపోల్చితే, పిల్లిబొమ్మచాలా పెద్దదిగా రాశాడు.

# బాలసంఘాలు

## విజయా బాలసంఘం: విజయనగరం:

డిసెంబరు 10 వ తేదీని ఈసంఘం ప్రారంభోత్సవం జరిగింది. విజయనగరం కాలేజీ ప్రిన్సిపాలు డాక్టరు కె. ఆర్. సుబ్రహ్మణ్య అయ్యర్ గారు అధ్యక్షత వహించారు. శ్రీపువ్వాడ శేషగిరిరావు గారు ఉపన్యాసకులు.

చి॥ వింజమూరి తాయారు, ద్వారం శ్రీనివాసరావు, ద్వారంశ్యామలప్రార్థన తరువాత చి॥ బచ్చుసరోజిని వీణవాయించింది. ఈబాలసంఘంలో 40మందిసభ్యులు చేరారు. చి॥ ద్వారం మంగతాయారు ప్రెసిడెంటుగాను, వింజమూరి లక్ష్మి కార్యదర్శిగాను ఎన్నుకోబడ్డారు. ఈ సభకు చాలామంది వచ్చారు.

## బెల్లంవారిపాలెం బాలసంఘం

మత్తుపల్లి అగ్రహార బాల సంఘ సభ్యులచేఈ క్రొత్తసంఘం డిసెంబరు 24న తేదీని పెట్టబడింది. జనవరిలో సంక్రాంతి ఉత్సవాలు జరిపారు. పెద్దసభచేశారు. శ్రీ నిమ్మగడ్డ వెంకట్రామయ్యగారు అధ్యక్షులు. శ్రీ నల్లూరి వెంకటరత్నమాచారిగారు 'బాల' సంఘాలగురించి ఉపన్యసించారు. "నీతిగీతావళి" చదివారు. బాలురచే హాస్యప్రదర్శనాలు, కంసవధ నాటకం జరిగాయి.

## వంకాయులపాడు ఆంధ్ర కేసరీ బాలసాహిత్యసమితి:

శ్రీ ఎ. వెంకటార్రావుగారి అధ్యక్షతను సభజరిగి "బాలుర-సంఘములు" గురించి ఉపన్యాసములు జరిగినవి. బాలుర విజ్ఞానాభివృద్ధికి బాల పత్రికను తెప్పించవలెనని తీర్మానముచేసిరి.

## అలబాజీపేట జాతీయ బాలసంఘం:

ఈ సంఘములో చేరిన కొందరుమెంబర్లు, సంఘమునకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని తెలిసింది. ఎట్టికష్టాలొచ్చినా, గాంధీతాత చెప్పినట్లు, అపకారికి ఉపకారముచేసి వానిని మంచిదారిలోనికి తేవలసింది. అంతకన్నా మంచిమార్గమే లేదు.

## చెరుకుగనమ శ్రీ నేతాజీ విద్యార్థి సేవాసంఘం:

"కల్పనాకథ" పోటి ఈసంఘం వారు జరుపుతున్నారు. కథ మూడుపేజీలకు మించకూడదు. బహుమానాలు వుంటాయి. పంపదలచినవారు: కార్యదర్శి వి. వి. హనుమాన్లుగారు చెరుకుగనమ, (వయా) పెంటపాడు అనిరాయండి.

## రాజమండ్రీ కాంగ్రెస్ బాలసంఘం:

సంక్రాంతిరోజులలో ఈసంఘం జన్మదినోత్సవంచేశారు. శ్రీ దొంతిశెట్టి వీర

భద్రరావు, మట్టా ఏడుకొండలరావు గార్లని, అధ్యక్షులుగాను, ఎస్. గోవింద రావుగారు సభాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. "బాలప్రపంచం" అనే నాటకం బాలురువేశారు.

### వాల్తేరు సుభాస్ బోస్ బాల సంఘం:

ఈసంఘం సంక్రాంతి పండుగలు జరిపారు. శ్రీ వక్కా హరనాథ్ గారు (అధ్యక్షులు) బాలసంఘాలగురించి ఉపన్యశించారు. శ్రీ ఉరిటి సన్యాశిరావు గారు ఉపాధ్యక్షులు, ఎ. వెంకటరావు గారు కార్యదర్శిగ ఎన్నుకోబడ్డారు.

### అల్లిపురం నేతాజీ బాల సంఘం:

ఈసంఘం భోగిపండుగనాడు స్థాపించబడినది. శ్రీ బి. ధర్మారావు, వి. సంజీవరావుగార్లు అధ్యక్షులు, కార్యదర్శిగ ఎన్నుకోబడ్డారు.

### శ్రీకాకుళం బాల సంఘం:

సంక్రాంతికి ఈసంఘం బాలలు "సీతాకల్యాణం" నాటకంవేశారు. శ్రీ కుమారం శ్యామల, ఎల్లాపంతుల సూర్యకాంతంగార్లకు బహుమతులివ్వబడెను. చక్కని నాట్యంచేసిన ఇద్దరు బాలికలకు ప్రత్యేక బహుమతులు ఇవ్వబడెను.

శ్రీకాకుళం హిందు బాలసంఘంలో చేరదలచుకొన్నవారు వారిపేరు, క్లాసు, వయసు, పూర్తిచిరునామా పంపప్రార్థన. ఆర్. కొండలరావు, శక్రటరీ, కోటీవారి వీధి, శ్రీకాకుళం.

## సవతిబిడ్డ

పిన్నీ నాన్నా
అక్కా బావా
అన్నా చెల్లీ
అంతా కలిసి
"బృందా తులసి"
బొమ్మకు వెళ్లి
ఫోర్డు కారులో
వచ్చారు-

★

అవ్వ గుడ్డిది
అత్త జడ్డిది
దొడ్డకు కష్టం
నాకు ఉత్సాహం
అమ్మమ్మ సణుగు
అచ్చమ్మ గొణుగు
చూస్తే నాకు
అంతా చికాకు

★

కుక్కి మంచం
బొక్కి కంచం
నల్లుల ముద్దులు
పిన్నిచే గుద్దులు
తిండికి ఎండడం
తిట్లుతిని ఉండడం
ఈ తలపోటు
నా కలవాటు

# బాల వినోద పజిల్ 7

**బాలల్లా రా!**

ఈసారి కూడా **మీరు** పజిలన్నయ్యని ఓడించారు. ఒకరు కాదు, సరియైన జవాబులు అయిదుగురు పంపారు. ఇదుగో వారి పేర్లు.

1. ధార్వాడ రామారావు (రాజమహేంద్రవరం)
2. ఎస్. విజయదుర్గ (పెండ్యాల)
3. పి. సీతారాం (పుంగనూరు)
4. బేబీసరోజ (బరంపురం)
5. చిట్టాసీతారామయ్య (బందరు)

ఇదుగో జనవరి పజిల్ సరియైన చదరం

| | | | | | |
|---|---|---|---|---|---|
| సం | క్రాం | తి | | కే | శ |
| ధి | | రు | క్మి | ణి | |
| | క్షే | ప | | | |
| మొ | | తె | మ్మ | డు | |
| రు | చి | | | ల | హా |
| సు | ఖు | | నే | ష | ము |

కొత్త పజిల్ ప్రక్క పేజీలో చూడండి.

* మీరు 'బాల' లోని చదరంమాదిరి చదరం వేరే కాగితంమీద రాసి పంపండి.
* మీ పేరు, పూర్తియడ్రసు చదరం పక్కని రాయాలి.
* చదరాలు 25 తేదీలోపుగా మాకు చేరాలి.

# దాగుడు బాలలు

**బాలలూ!**


ఈసంచికలో అక్కడక్కడ కొందరు బాలల ఫోటోలు వేశాము. వాటిక్రింద పేరుగాని, ఊరుగాని లేదు. చూడండి బహుశా ఆఫోటో మీదేమో! ఆ ఫోటో మీదైతే—వెంటనే మీపేరు, ఎడ్రసు, ఎన్నో పేజిలో ఆఫోటో పడిందో అంతా సరిగా రాసి పంపండి. గురుతు పట్టిన దాగుడు బాలలకు—వారి పేరున ఒక సం॥ వరకూ "బాల" ఉచితంగా పంపిస్తాం.

జనవరి సంచికలోని దాగుడు బాలలలో ఈదిగువ వారికి "బాల" సం॥ వరకూ ఉచితముగా పంపబడును.

1. చి॥ అయ్యగారి రామమోహన విఠల్. (బొబ్బిలి)
2. చి॥ ఆర్. బాలాజీ (గుత్తి)
3. చి॥ఆర్. కమలాదేవి(బెంగుళూరు)
4. చి॥ గరికపాటి స్వరాజ్యం (పడమటలంక)

ఫోటోలన్నయ్య
"బాల" ఆఫీసు
లజ్, మద్రాసు 4

# బాలవినోద (గాంధీ) పజిల్ నెం 8



ఈ ఆధారముల సహాయంతో గదులన్నీ పూర్తి చేయండి.

1. బాలలు అంటే ఇష్టం గనుక గాంధీజీకి ఈపేరు వచ్చింది.
2. స్వరాజ్యం దీనిద్వారా సంపాదించాడు గాంధీజీ.
3. అందరూ ఇలావుండాలంటాడు గాంధీజీ.
4. దేశం, ప్రజలు ఇలావుండాలని గాంధీతాత కోరిక
5. అందరినీ గాంధీజీ దీనితో చూచేవాడు.

6 హిందువులకీ, ముస్లింములకీ మధ్య ఇదివుండాలి

7. వీరి అభివృద్ధికి గాంధీజీ ఎంతో పాటుపడ్డాడు.

8' ప్రపంచానికి గాంధీజీ ఇచ్చిన సందేశం.

9. మనం గాంధీజీని ఇలా పిలుస్తాం

10 వీరికోసమే గాంధీజీ ప్రాణాలు విడిచేశాడు.

11 గాంధీజీ ఇదే పలుకుతాడు

12 హిందూ ముస్లిం సఖ్యతకోసం గాంధీజీ ఇది చేశాడు,

☞ ఈపజిల్ పూర్తిచేసి ఫిబ్రవరీ 25 తేదీ లోపుగా పంపండి.



ఆ ఇద్దరు పాపల ఆటలూ, పాటలూ చూచి ఆతల్లి మురిసిపోతోంది.

ఆతల్లి ఆరోగ్యంగా వుండబట్టే అంతచక్కని పిల్లలు పుట్టేరు.

ఆమె ఆరోగ్యానికి ప్రతిరోజూ ఏమిటి పుచ్చుకుంటుందో తెలుసా?

# లోధ్ర

కేసరికుటీరం లిమిటెడ్,

రాయపేట-మదరాసు 14


# బొమ్మల పజిల్

బాలా!

ఈపక్క పేజీలో ఒక కొత్త రకం పజిల్ వుందిచూడు. మొదటి వరుస చూడు.

1 నెంబరు బొమ్మలో ఒక బాతు, లక్ష్మి బొమ్మలున్నాయి. బాతులోని "బా" ను లక్ష్మిలోని 'ల' ను కలపండి-'బాల' అయింది. 2 నెంబరు బొమ్మలో పిల్లలున్నారు. 3 నెంబరు బొమ్మలో పత్రిక చదువుచున్నట్లుంది. వీనినిబట్టి "బాల పిల్లలపత్రిక" అనే వాక్యం తయారయింది.

అల్లాగే మరిరెండు వాక్యాలు మిగతా బొమ్మల్లో చూచి తయారు చేయ వచ్చును. నెం 4 నుండి 11 వరకు ఒకవాక్యం; 12 నుంచి "లేదు" వరకు ఇంకో వాక్యం - ఏదీ కూర్చు చూద్దాం!

పక్క పేజీలోని నెంబర్లు వేరే కాగితం మీద వేసి, పూర్తిచేసి, పంపండి.

పజిలన్నయ్య

c/o 'బాల' మద్రాసు 4

# బా ల బొ మ్మ ల ప జి ల్

(ప్రక్క పేజీలో దీనిని గురించి చదవండి')




1 — బాల

2 — పిల్లల

3 — పత్రిక

4 ..................

5 ..................

6 ..................

7 ..................

8 ..................

9 ..................

10 ..................

11 ..................

12 ..................

13 ..................

14 ..................

15 ..................




## రేడియో చిట్టిపాపల ప్రోగ్రాం

ప్రతి శనివారము పొద్దున్న 8-30 నుంచి 9 వరకు

[211 మీటర్లు, 41 మీటర్లమీదా వినొచ్చు]

---

### ఫిబ్రవరి

**7-వ తేదీ శనివారం**

పిల్లలారా రారండోయి; రైలుబండి పాట; బంగారుబాతు-నాటిక; చిరంజీవులకి అక్కయ్య దీవెనలు; నీ చేతు లేవి-మాటలు; అనగా అనగా కథ; ఏదీ ఒక పాట.

**14-వ తేదీ శనివారం**

పిల్లలారా రారండోయ్; పూలదండ పాట; ఈగ పేరు-నాటిక; అనగా అనగా కథ; అక్కయ్య దీవెనలు; ఏదీ ఒక పాట.

**21-వ తేదీ శనివారం**

పిల్లలారా రారండోయ్: దాగుడు మూతలు-ఆటపాట; చుక్కలబాల-నాటిక; నీ పాట ఏదీ? అనగా అనగా కథ; అక్కయ్య దీవెనలు.

**28-వ తేదీ శనివారం**

పిల్లలారా రారండోయ్; చిన్నిబిన్ని పాట; చెప్పుకో చూదాం; చీమ, బాలుడు-పాటకథ; అనగా అనగా కథ. అక్కయ్య దీవెనలు.

---

**తెలుసా**

సూర్యుని కిరణములలో ఏడు రంగులున్నాయి. ఊదా, నీలము, ఆకారంగు, హరితము, పసుపుపచ్చ, నారింజ, రక్తమురంగులు. "ఊనీ ఆహాపనార" అనిగురుతు మాటజ్ఞాపకం వుంచుకుంటే ఏడురంగులూ చెప్పవచ్చును— తెలుసా? ఈశ్వరపు చంద్రశేఖరావు (విశాఖపట్టణం)



# రేడియో పిల్లల ఆటవిడుపు ప్రోగ్రాం

[211 మీటర్లు, 31.36 మీటర్లమీదా వినవచ్చు]

[ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2-15 నుంచి 3 వరకు]

## ఫిబ్రవరి

### 1-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; చంద్రగుప్తుడు-నాటిక; పుట్టిన రోజులు; ముత్యాలహారం - పాటకథ; చిక్కుప్రశ్న; మీ పాటలు, కథలు; పోదామా.

### 8-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; శకుంతల - నాటిక; పుట్టిన రోజులు; మెమ్మెమ్మే - నాటిక; పోదామా.

### 15-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; శాతకర్ణి-నాటిక; పుట్టినరోజులు; బిచ్చపిల్ల - పాటకథ; చిక్కుప్రశ్న; పోదామా.

### 22-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; రాజహంస - నాటిక; పుట్టిన రోజులు; చిక్కుప్రశ్న; మీ పాటలు, కథలు; వసంతం-పాటకథ; పోదామా.

### 29-వ తేదీ ఆదివారం

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాల సంచి; విక్రమార్కుడు నాటిక; పుట్టిన రోజులు; దొర పాట కథ; చిక్కుప్రశ్న; పోదామా.

---

**తెలుసా**

గంటకు 500 మైళ్ళ వేగముతో పోయేవిమానము ఎక్కడాఆగకుండా పోతే, అది సూర్యుడిని చుట్టిరావడానికి సుమారు 7 నెలల20 రోజులు తీసికొంటుంది.

వేలమూరి రాఘవేంద్రరావు

# అమృతాంజనము

అమృతాంజనము వాడవేమి ?
నీదు - ఆదివ్యాధుల బాయవేమి ;

1 ప్రతిషాపునందది, సులభముగ చిక్కును
ఎటువంటినొప్పిని తృటిలోన నొక్కును
మితమైన వెలయనుచు మిగులపేరెక్కెను
తతఖ్యాతితోడ సంతతము అదిచొక్కును ॥అమృ॥

2 తలనొప్పి దానివాసనగొని తొలగును
కీళ్లనొప్పులు దానికీ వెఱిగితొలగును
పడిశములు దానిసంపర్కమున బఱచును
జలుబు రొంపలు దానిచాయగని వెఱచును ॥అమృ॥

3 ఆరోగ్యమున తేరి ఐశ్వర్యమునమీరి,
దేశీయ జాతీయ స్వాతంత్ర్యమునుగోరి,
పోరాడుచుండు వీరులకు, ఉద్యోగులకు,
కూరిమిని గూర్చగల సారమని తెలిసికొని ॥అమృ॥

4 అమృతాంజనం బవసరములేని దేహంబు
జగతిలో లేదనుచు చాటుప్రతిగేహంబు
విడువుమయ్యా ఇంక వెడగుసందేహంబు,
తడబడకపిదప సంగ్రహముంచు వేగంబు ॥అమృ॥

గరిమెళ్ల సత్యనారాయణ, బి. ఎ.



బొమ్మల
సామెత



# అందుతే  ,---

# అందకపోతే 

కూర్పు: ఈశ్వరపు చంద్రశేఖరరావు (వాల్తేరు)


మేలైన ఇంగువనే భోజన పదార్థాలలో

వేయాలని అందరికీ తెలుసు

అయితే, అది ఏదో మాత్రం కొందరికే తెలుసు

శ్రేష్ఠమైన ఇంగువ కావాలంటే—

తిలక్ మార్కు ఇంగువ కొనాలి.

అది అన్నిషాపులలోను దొరుకుతుంది. లేదా, యీక్రింది అడ్రసుకు వ్రాయవచ్చును.

గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి, G. T. మద్రాసు.

# క్షయరోగము

'గత మార్చి 1947 లో, నా స్నేహితుడొకడు, ఆకలి మాంద్యము, దగ్గు, సాయంకాలము జ్వరము మొదలగు క్షయవ్యాధి సూచనలతో బాధపడెను. అనేక విదేశమందులతో చికిత్సబొందినను లాభములేనందున, నేను వానికి శ్రీ రాజకన్నప్పన్ గారి పరిచయముచేసితిని. వారు రోగిని పరీక్షించి, భస్మములను కొన్నిటినిచ్చెను. 10 దినములలో గుణము కనబడి, రోగికి జ్వరము, దగ్గు, తగ్గి, ఆకలి ఎక్కువైనది. చికిత్స పూర్తికాగానే సంపూర్ణారోగ్యము పొందెను. శ్రీ రాజకన్నప్పన్ గారి చికిత్సలో నాకు సంపూర్ణనమ్మకముగలదు. వారికి జయమగుగాక.'

మదరాసు 4-7-1947 Sd. పి. కన్నయ్యనాయుడు.

ఉదయం 8 గం॥ నుంచి 10 గం॥ వరకు డాక్టరుగారిని చూడవచ్చును.

20 రోజులు (ఒకచికిత్స) మందు రూ॥ 20

## డాక్టరు ఏ. సి. రాజకన్నప్పన్


S/o దేవీపండిట్ ఏ. సి. కన్నప్పముదలియార్.

క్షయరోగ వైద్యశాల } 3-ఏ, మొదవాక్కం టాంక్ రోడ్డు, కీల్పాక్ పోస్టు, మదరాస్. (కెల్లీస్ బస్సుస్టాండుదగ్గర)







Edited and Published by N. Raghava Rao, 20, Sundareswar St., Mylapore, Madras 4. Printed by Dr. S. Seshagiri Rao at the Lodhra Press, Kesari Kuteeram Ltd., 15, Westcott Road, Royapettah, Madras-14.



చి॥ పందిలి వినయమోహన్ (మదరాసు)



చి॥ వై. దేవదాసు (మదరాసు)

- బాలలకూ
- బడులకూ
- గ్రంథాలయాలకూ



బహుమంచి అవకాశం!

## ముచ్చటైన ముద్దుల

# "బాల" బైండు సంపుటి

(ఆగస్టు 1945 నుండి జూలై 1946 వరకు)

## 1,000 పేజీలు!

ఈసంపుటిలో సుమారు 150 చక్కని కథలూ, 100 విజ్ఞాన విషయాలూ, బోలెడు తమాషా నవ్వుతాల రచనలు, తమాషా బొమ్మలు, బడులలో పిల్లలు ప్రదర్శించే నాటికలు, పాటకథలు, బొమ్మల పద్యాలు, అంకెల తమాషాలు, బోలెడు చిక్కు ప్రశ్నలు, పొడుపు కథలు, పిల్లల ఆటలు, పాటలు, ముగ్గులు, రంగులబొమ్మలు, ఎన్నోవున్నాయి.

## వెల పదిరూపాయిలు

పోస్టేజితో సహా

సరిగా 30 ప్రతులు మాత్రమే వున్నవి గనుక మొదటి 30 ఆర్డర్లకు వరుసగా పంపబడును. వెంటనే మనియార్డరు పంపండి.

**మేనేజరు, "బాల" మైలాపూరు, మదరాసు 4.**

PRINTED AT THE LODHRA PRESS 15, WESTCOTT RD., ROYAPETTAH, MADRAS-14